
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




ఖమ్మం

5

బుధవారం, 12 మార్చి 2025

మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మంమార్కెట్ మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 14 నుంచి 16 వరకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా, శని ఆదివారాలు వారాంతపు సెలవులు కారణంగా వరుసగా సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 17 సోమవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం
సా.. 6.23 గం॥
సహార్ : గురువారం
ఉ..4.57 గం॥




వెంకటేశ్వరరావు, పంకజ్




వెంగళరావు, గోపాలరావు

పరిమళించిన ప్రతిభ

- గ్రూప్-2 ఫలితాల్లో మెరిసిన ఖమ్మం రత్నాలు
- కుమ్మర పంకజ్‌కు 47వ ర్యాంకు
- దుగ్గిదేవర వెంకటేశ్వరరావుకు 148వ ర్యాంకు
- ధరావత్ వెంగళరావుకు 277వ ర్యాంకు
- కోట గోపాలరావుకు ఎస్సీ కేటగిరీలో 6వ ర్యాంకు 7
- స్వగ్రామాల్లో హర్షాతిరేకాలు



పట్టుబడిన ఉద్యోగి భూక్యా సోమ్లానాయక్

లంచగొండి ఆటకట్టు

- ఏసీబీ వలలో ఎక్సైజ్‌శాఖ సీనియర్ అసిస్టెంట్
- రూ.1500 లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు 6



వైరా పోలీస్‌స్టేషన్‌లో దోపిడీ దొంగల ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- రెండు కార్లు సహా రూ.37లక్షల సొత్తు స్వాధీనం
- కరడుగట్టిన నేరస్థులకు చెక్ 6
- ఐదు రాష్ట్రాల్లో చోరీలు, దోపిడీలు
- నిందితులు నలుగురూ ఏపీ, తమిళనాడు వాసులు



విచారణ ఖైదీ రమేశ్

పారిపోయాడు.. పట్టుబడ్డాడు..

- సత్తుపల్లి సబ్‌జైలులో గోడ దూకి విచారణ ఖైదీ జంప్
- 3 గంటల్లోనే ఎర్రగుంటపాడులో పట్టుకున్న పోలీసులు 7

చురుగ్గా ఇంటర్ స్పాట్


- జిల్లాకు 2,97,760 జవాబు పత్రాలు
- సీసీ కెమెరాల పర్యవేక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల మూల్యాంకనం నగరంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో చురుగ్గా సాగుతోంది. మొదటి రోజు మొత్తం 24 మంది అధ్యాపకులకు 15 మంది హాజరై ఒక్కొక్కరు 30 పేపర్ల చొప్పున 450 సంస్కృతం పేపర్ల మూల్యాంకనం నిర్వహించారు. మంగళవారం 24 మంది అధ్యాపకులకు 19 మంది హాజరై ఒక్కొక్కరు 30 పేపర్ల చొప్పున 570 పేపర్లను మూల్యాంకనం చేయగా మొత్తం 1,020 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయినట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు.

ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మూల్యాంకనం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభించి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నారు. జిల్లాకు మొత్తం 2,97,760 జవాబుపత్రాలను కేటాయించినట్లు డీఐఈవో తెలిపారు. ఈ మూల్యాంకనం మార్చి 20 తరువాత ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందని తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24 మంది అధ్యాపకులు, ఇద్దరు చీఫ్ ఎగ్జామినర్లు, ఇద్దరు అసిస్టెంట్ ఎగ్జామినర్లు విధుల్లో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం సంస్కృతం పేపర్ల మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేటు కళాశాలలో ఐటీ దాడులు

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో మంగళవారం తెల్లవారుజామున ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఆ సంస్థకు చెందిన పలు బ్రాంచీలలోను సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. తెలంగాణ తోపాటు ఇతర రాష్ట్రాల్లోని బ్రాంచీలలో ఐటీ అధికారులు దాడులు నిర్వహించారని తెలిసింది. కాగా ఖమ్మం నగరంలో ఆ సంస్థ కళాశాలల్లో, యాజమాన్యాల నివాసాలలో అధికారులు దాడులు నిర్వహించి పలు ఫైళ్లను తీసుకెళ్లినట్లు సమాచారం.



రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రెండోసారి రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు జరిగే కేటాయింపులపై భిన్నవర్గాల వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. బడ్జెట్ నిధుల కేటాయింపులతోనే జిల్లా సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ వంటి రహదారులు గ్రామ పట్టణాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి ముడిపడి ఉంది. ఈసారి బడ్జెట్‌లో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు నిధులు అధికంగా కేటాయిస్తారని ఆశిస్తున్నారు. ప్రభుత్వం రాజీవ్‌లింక్ కెనాల్‌కు రూ.90 కోట్లు కేటాయించి కృష్ణా, గోదావరి జలాలు అనుసంధానం అయ్యేలా ఏన్కూరువద్ద సాగర్‌కు అనసంధానం చేసిన విషయం విధితమే. మంత్రి తుమ్మల చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి, భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు మంజూరుచేశారు.

భట్టి.. లెక్కగట్టి..

- నేడే అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక బడ్జెట్
- కేటాయింపులపై ఉమ్మడి జిల్లా ఆశలు
- ఆర్థికమంత్రిగా రెండోసారి ప్రవేశపెడుతున్న విక్రమార్క
- సీతారామ ప్రాజెక్టు పూర్తిపై దృష్టి పెడతారా?
- పెదవాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు నిధులిస్తారా?
- మెడికల్ కళాశాలల భవనాలపై కరుణిస్తారా?
- జిల్లా వాసిగా తనదైన ముద్ర చూపుతారని అంచనాలు

ఖమ్మం, మార్చి11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన లిఫ్టులను ప్రారంభించారు అయితే ఇప్పటి వరకు సుమారు రూ.10వేల కోట్లు ఖర్చుకాగా 2026 ఆగస్టు 15 నాటికి పూర్తిస్థాయిలో సీతారామ పనులు పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి వైరా సభలో హామి ఇచ్చారు. ఈఏడాది పనులు జరగాలంటే కనీసం రూ.5వేల కోట్లు అవసరం ఉంది. పాలేరు లింకు కెనాల్ పనులతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు చేపడితేనే సీతారామ ద్వారా ఎక్కువ ఆయకట్టుకు నీరు లభిస్తుంది. ప్రస్తుతం ఉన్న ప్రధాన కాలవ ద్వారా సాగర్ ఆయకట్టుకు మాత్రమే నీరందించే (మిగతా 6వ పేజీలో)



నగరానికి కొత్త కళ

- రూ.249 కోట్లతో అండర్ డ్రెయినేజీ నిర్మాణం
- వరదలు, మురుగునీరు నివారణకు చెక్
- తొలిదశలో ఊరచెరువు నుంచి ధంసలాపురం చెరువు వరకు ఏర్పాటు
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నగరానికి కొత్త కళ రాబోతోంది. రాష్ట్రంలో, దేశంలో కొన్ని ప్రముఖ నగరాల్లో ఉన్న అండర్ డ్రెయినేజీ విధానాన్ని ఖమ్మంలో అమలు చేయడం ద్వారా మురుగునీరు దుర్వాసన, దోమల బెడద నివారణ సమస్యలకు పరిష్కారం లభించనుంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అండర్‌డ్రెయినేజీ పనులు బుధవారం ప్రారంభం కాబోతున్నాయి. రూ.249 కోట్లతో మంత్రి తుమ్మల నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లో సాయంత్రం 5గంటలకు అమృత పథకం కింద భూగర్భ మురుగు నీటిపారుదల వ్యవస్థ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం ఖమ్మం కార్పొరేషన్ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసింది. మొదటగా 9.6 కి.మీ. మురుగు నీటిని పైపులైన్ ద్వారా ఊరచెరువు నుంచి ధంసలాపురం చెరువు వరకు డ్రెయినేజీ ఏర్పాటుచేస్తున్నారు. అంతర్గత పైపులైన్ ద్వారా మురుగునీటిని అనుసంధానం చేసి మురుగునీటి శుద్ధి కేంద్రం ద్వారా శుద్ధిచేసి ఆ తర్వాత నీటిని వదలనున్నారు. 44 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రం ధంసలాపురంలో 9.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధికేంద్రం పుట్టకోటలో ఏర్పాటుచేయనున్నారు. ఖమ్మంలో అండర్‌డ్రెయినేజీ నిర్మాణానికి సుమారు రూ.1200 కోట్లతో ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధంచేశారు. అలాగే వరదనీటి నివారణకు డ్రెయిన్ల ఏర్పాటుకు రూ.250కోట్లతో డిటెయిల్ ప్రాజెక్టు సర్వే పూర్తిచేశారు.

వరదలు, మురుగునీరు నివారణకు చెక్

ఖమ్మ నగరంలో మరురుగునీరు నివారణతో పాటు ఆకస్మికంగా వచ్చిపడుతున్న వరదలకు శాశ్వత నివారణ చేయించేందుకు ఈపనులు చేపడుతున్నామని మంత్రి తుమ్మల ఒక ప్రకటనలో తెలిపారు. మొదట మురుగునీటి తోపాటు వరదనివారణ అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పైపులైన్ ద్వారా చేపట్టే రూ.249 కోట్ల పనులకు శంకుస్థాపన జరుగుతుందని, నగరంలో పూర్తిస్థాయిలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.1200 కోట్లతో ప్రణాళిక రూపొందించామని, శాశ్వత వరద నివారణకోసం రూ.240 కోట్లతో పూర్తిస్థాయి సర్వేచేశామని త్వరలో ఈ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖమ్మంలో అనేక కాలనీలకు వరద నీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో పాటు ఇండ్లలో కూడా చేరి పట్టణవాసులకు నష్టం చేసిందని, ఖమ్మంపట్టణంలోని కాలనీలు వరదముంపుకు గురికాకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారంగా బహుళ ప్రయోజనాలతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు.



విప్లవ కమ్యూనిస్టు యోధుడు రవన్న

- గోదావరిలోయలో ఉద్యమాన్ని నిర్మించారు
- ఎన్డీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని

వివరాలు : 6లో



30లోగా అందరికీ రైతు భరోసా

- అక్కడక్కడా రుణమాఫీ జరగాల్సిన మాట వాస్తవమే
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు : 6లో



'ఈ-కానుక'లు ఎలా..?

భద్రాచలంలోని రామాలయ ప్రాంగణంలో 'ఈ-కానుక'లు సమర్పించే భక్తుల కోసం రెండు చోట్ల క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. డిజిటల్ పేమెంట్లు రాజ్యమేలుతున్న కాలంలో భక్తులకు అనువుగా ఈ ఏర్పాటుచేయడం బాగానే ఉంది. కానీ ఆలయంలోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వడం లేదు. మరి తాము ఎట్లా ఈ-కానుకలు సమర్పించాలని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సెల్‌ఫోన్లు అనుమతించే ప్రదేశాల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆలయ అధికారులు ఏం చేస్తారో చూడాలి.

-ఆంధ్రజ్యోతి, భద్రాచలం

సాగునీటి సెగ..

- రాపల్లె మేజర్ పై పర్యటించిన నీటిపారుదలశాఖ అధికారులు
- పంటలు ఎండుతున్నాయని నిలదీసిన రైతులు
- పంటలు ఎండకుండా చూస్తాం: ఎస్ఈ వాసంతి
- ఏప్రిల్ చివరి వరకు నీళ్లు ఇవ్వాలి: రైతులు 6
- అంతరాయం లేకుండా వారం పాటు ఇవ్వాలని డిమాండ్

కనకపు 'తునక'

- అటవీ ప్రాంతంలో వేసవి పంటగా తునికాకు సేకరణ
- టెండర్ల నిర్వహణలో తీవ్ర జాప్యం చేస్తున్న ప్రభుత్వం
- ప్రారంభం కాని మోడెం కొట్టే పనులు
- అడవిలో అగ్గితో అధికారులకు ప్రయాస 6
- గ్రామాలలో ఉపాధి హామీ పనులతో ఆకు సేకరణకు ఆటంకం



కార్యక్రమానికి హాజరైన వారు

విప్లవ కమ్యూనిస్టు యోధుడు రవన్న

- గోదావరి లోయలో ఉద్యమాన్ని నిర్మించారు
- ఎన్డీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాయల సుభాష్‌చంద్రబోస్ విప్లవ కమ్యూనిస్టు యోధుడుగా తన జీవిత కాలాన్ని గడిపారని సీపీఐ(ఎంఎల్) ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా, విభజన జరిగిన తర్వాత తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సాదినేని వెంకటేశ్వరరావు, పి.ప్రసాద్, ఏఐకేఎంఎస్ గౌరవ అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో మధు అధ్యక్షతన రవన్న 9వ వర్ధంతి సభను నిర్వహించారు. అంతకుముందు జిల్లా పరిషత్ సెంటర్ నుంచి వైరా రోడ్డు ద్వారా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రవన్న విప్లవ పోరాటాలను వివరించారు. విద్యార్థి దశ నుంచి విప్లవోద్యమానికి రవన్న బాటలు వేశారని కీర్తించారు. గోదావరిలోయలో ఉద్యమాన్ని నిర్మాణం చేశారన్నారు.

రాష్ట్ర ఉద్యమానికి నాయకత్వం వహిస్తూనే కేంద్ర కమిటీలో కీలకంగా పనిచేశారని పేర్కొన్నారు. 1980 నుంచి రవన్నతో కొన్ని విధానపరమైన భేదాభిప్రాయాలు ఉన్నాయనీ, అయినా రవన్న రాజకీయ వారసత్వాన్ని తాము కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, ఝాన్సీ, మంగ, నాగన్న, విప్లవ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, కోలా లక్ష్మీనారాయణ, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శన

కనకపు 'తునక'



- వేసవి పంటగా తునికాకు సేకరణ
- టెండర్ల నిర్వహణలో తీవ్ర జాప్యం
- ప్రారంభం కాని మోడెం కొట్టే పనులు
- అడవిలో అగ్గితో అధికారులకు ప్రయాస
- ఉపాధి పనులతో ఆకు సేకరణకు ఆటంకం

మణుగూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వేసవిలో వందలాది మందికి నెల రోజుల పాటు తునికాకు సేకరణ ఆదాయ వనరు. ప్రతీ ఏడాది మే నెలలో తునికాకు సేకరిస్తారు. ప్రకృతి సంపద తునికాకు సేకరణ వేసవి పంటగా భావిస్తారు. అయితే మణుగూరు అటవీ డివిజన్‌లో తునికాకు లక్ష్యం నెరవేరడం లేదు. ఏ యేటికాయేడు లక్ష్యం చేరడం కష్టమౌతుంది. 2021 ముందు లక్ష్యాన్ని మించి తునికాకు సేకరణ జరిగేది. రాను రాను పరిస్థితి దిగజారుతోంది. ఈ సంవత్సరం 5400 స్టాండర్డ్ బ్యాగులు లక్ష్యంగా పెట్టుకోగా కనీసం ఆ మార్కు దాటే పరిస్థితి లేదు.

టెండర్లలో జాప్యం

టెండర్ల ప్రక్రియ ప్రతీ సంవత్సరం ఆలస్యం అవుతోంది. డిసెంబరులోనే టెండర్ల ప్రక్రియ పూర్తి కావాలి. జనవరి నెలాఖరుకు మోడెం కొట్టాలి. మార్చి నెలాఖరుకెళ్లా ఆకులు ఏపుగా పెరుగుతాయి. ఏప్రిల్ నెలనుంచి ఆకుల సేకరణప్రారంభం అవుతుంది. మే నేలాఖరు కెల్లా ఆకు సేకరణ ముగుస్తుంది. అయితే ఏటా టెండర్ల ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. జిల్లాలో ముఖ్యంగా మణుగూరు డివిజన్‌కు టెండర్లలో పోటీ ఉంటుంది. ఈ ప్రాంతంలో తునికాకుకు ధర కూడా నిర్ణయించలేదు.

ప్రారంభం కాని మోడెం పనులు

తునికాకు సేకరణలో కీలకం మోడెం నరికివేత. గత 15 ఏళ్లుగా మోడెం నరికివేత పనులు జనవరి లోనే ప్రారంభమై ఫిబ్రవరిలో పూర్తి కావాల్సి ఉంది. నేటికి ఈ పనులు ప్రారంభం కాలేదు. మోడెం సక్రమంగా నరికితేనే నాణ్యమైన తునికాకు లభిస్తుంది. అది చేత కాక కాంట్రాక్టర్లు కొంత మందికి డబ్బులు ముట్టజెప్పి ఏకంగా అడవులకే నిప్పు పెట్టిస్తున్నారు. డివిజన్ పరిధిలోని మణుగూరు రేంజ్‌లో ఖమ్మం తోగు, బుగ్గ , అశ్వాపురం మండలంలోని వనబోతుల గూడెం, వేములూరు తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర అడవులు కాలిపోతున్నాయి. ఆ మంటలను ఆర్పడం అధికారులకు తలకు మించిన భారం అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తునికాకు సేకరణ లక్ష్యం దెబ్బతింటోంది.

నాణ్యమైన తునికాకు కష్టమే

నాన్యమైన తునికాకు లభించడం కష్టంగా మారుతోంది. తునికాకు కోసం అడవుల్లో చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. చాలా మంది తునికాకు సేకరణకు దూరం అవుతున్నారు. ఒకప్పుడు తునికాకు సీజన్‌లో పండుగ వాతావరణం కన్పించేది. తునికాకు సేకరణ లక్ష్యం నీరు కారేందుకు ఉపాది హామీ పనులు కూడా మరో కారణం, తునికాకు సేకరణ సమయంలో ఉపాధి హామీ పనులను నెల రోజులు వాయిదా వేయగలిగితే మేలని అధికారులు అంటున్నారు.

లక్ష్యం చేరేందుకు కృషి చేస్తాం
సయ్యద్ మక్సూద్ మోహినుద్దీన్, ఎఫ్‌డీవో



తునికాకు సేకరణ లక్ష్యం చేరేందుకు శాఖ తరుపున కృషి చేస్తామని ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మోహినుద్దీన్ తెలిపారు. టెండర్లు పూర్తి కాలేదని, మోడెంలో జాప్యం జరుగుతోందని అన్నారు. నాణ్యమైన తునికాకు లభించే అవకాశాలు ఉన్నాయని, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం అడవులను కాల్చడం వల్ల తునికాకుకు శాపం గా మారుతోందని అన్నారు. ఈ సంవత్సరం 5400 స్టాండెడ్ బ్యాగుల లక్ష్య సాధన ఉందన్నారు. అడవులను కాల్చడం వల్ల తునికాకుకే కాకుండా ఇతర వృక్ష సంపదకు తీరని నష్టం వాటిల్లుతోందని, ఆయా గ్రామాల ప్రజలు అడవులను రక్షించుకునేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

సాగునీటి సెగ..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- రాపల్లె మేజర్‌పై పర్యటించిన నీటిపారుదలశాఖ అధికారులు
- పంటలు ఎండుతున్నాయని నిలదీసిన రైతులు
- వారం పాటు వరుసగా సాగునీరు ఇవ్వాలని డిమాండ్

కొణిజర్ల, మార్చి11(ఆంధ్రజ్యోతి): పత్రికల్లో వస్తేగాని మీకు మా సమస్య అర్థకావడంలేదా, ఇబ్బందిపడుతున్నా పట్టించుకోని మీరు ఇప్పుడు ఎలా వచ్చారంటూ నీటిపారుదలశాఖ అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'ఇరిగేషన్..ఇరిటేషన్..' శీర్షికతో కథనం ప్రచురితం అయింది. దీనికి స్పందించిన నీటిపారుదలశాఖ ఎస్ఈ వాసంతి, డీఈ గౌతమిశిల్పా, ఈఈ బాబూరావు, ఏఈ నవీన్‌లు మండలంలోని రాపల్లె మేజర్ పై మంగళవారం పర్యటించి ఆయకట్టు పంటలను పరిశీలించారు. ఎస్ఈ వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు ఆమె వద్దకు చేరుకున్నారు. పంటలు ఎండుతున్నా ఎందుకు మీరు పట్టించుకోవడంలేదని నిలదీశారు. పైన ఎండుతున్న పంటలను వదిలేసి కిందకు ఎలా నీటిని పంపుతారని, తమ పంటలు ఎండిపోవాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారబందిని సక్రమంగా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాటలు చెప్పకుండా ఎండుతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. సాగునీటి సమస్యపై పత్రికల్లో కథనం రావడంపై ఎస్ఈ వ్యవసాయశాఖ కిందిస్థాయి ఉద్యోగులను, ఇరిగేషన్ మండలస్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన్నట్లు తెలిసింది.



ఎండుతున్న వరిపంటను పరిశీలిస్తున్న రైతులు

అందరికీ నీరందేలా ప్రణాళిక...

ఎస్ఈ మాట్లాడుతూ తాను కల్లూరు జూడిషన్ పరిధిలో పని చేస్తున్నానని, ఇక్కడ అధికారి లేకపోవడంతో చార్జ్ తీసుకున్నాని తెలిపారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు రావలసింది 1300 క్యూసెక్కుల నీరు అని, కాల్వ షట్టర్‌లు సక్రమంగా లేకపోవడం వలన 1000 క్యూసెక్కులు మాత్రమే నీరు వస్తోందన్నారు. నీటిని అందరికీ అందేలా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. పంటలు ఎండకుండా మేజర్ సామర్థ్యం మేరకు 200 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తామని అన్నారు. డీఈ గౌతమిశిల్పాను పిలిచి రాపల్లెమేజర్ సామర్థ్యం చూసి నిరంతరాయంగా ఐదు రోజులు నీళ్ల ఇవ్వమని ఆదేశించారు. దాంతో రైతులు ఐదు రోజులు సరిపోవని, ఐదు రోజులు కూడా నిరంతరాయంగా నీళ్ల ఇవ్వాలని కోరారు. దాంతో డీఈ ముందు ఐదు రోజులు ఇస్తాం అవి సరిపోకపోతే పరిశీలిస్తామని అన్నారు. బోనకల్ బ్రాంచ్ పరిధిలో కొణిజర్ల, వైరా, చింతకాని, బోనకల్ మండలాలు ఉన్నాయని, ఏడు రోజులు పాటు నిరంతరంగా నీళ్ల ఇస్తే రైతులకు సరిపోతుందని తెలిపారు. కాగా రైతులు సాగర్ జలాలను కూడా ఏప్రిల్ చివరి వరకు ఇవ్వాలని కోరారు. దాంతో ఎస్ఐ వాసంతి తమకు ఉన్న ఆదేశాలు ప్రకారం ఏప్రిల్ 15 వరకు ఇస్తామన్నారు. అలా అయితే పంట చేతికి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



నీటిపారుదలశాఖ ఎస్ఈ వాసంతితో మాట్లాడుతున్న రైతులు

రాపల్లె మేజర్‌కు నీటి విడుదల...

రాపల్లె మేజర్ పై నీటిపారుదలశాఖ అధికారులు పర్యటించి రైతుల ఆవేదన మేరకు నీటిని విడుదల చేశారు. దాంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ముందున్న రైతులకు నీళ్ల సరిపోగానే చివరి రైతులకు వదిలిపెట్టాలని ఎస్ఈ వాసంతి, డీఈ గౌతమిశిల్పా సూచించారు. ఎస్ఈ వద్దకు రైతులకు మద్దతుగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య తదితరులు వెళ్లారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండ వైరా, రాపల్లెమేజర్ కాల్వల పరిధిలోని ఆయకట్టు భూములకు నీళ్ల ఇవ్వాలని దొండపాటి రమేష్ ఎస్ఈని కోరారు.

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అరెస్టు

వైరా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలోని ఐదు రాష్ట్రాల్లో చోరీలు, దోపిడీలు, హత్యలకు పాల్పడుతున్న కరుగుకట్టిన నలుగురు నేరస్థుల ముఠా ఆటలకు తెలంగాణకు చెందిన ఖమ్మం పోలీసులు చెక్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఈ నేరస్థుల ముఠాను అరెస్టు చేసి రూ.37లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంజిల్లా వైరా పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఈ నలుగురు నేరస్థుల ముఠా చేసిన చోరీలు, దోపిడీలు, హత్యల గురించి వెల్లడించారు.

వైరా మునిసిపాలిటీలోని 9వ వార్డులో గతనెల 12వతేదీన ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు శీలం వెంకట్రావమ్మను సర్వే పేరుతో ఇంట్లోకి ప్రవేశించి కాళ్లు, చేతులు, నోటికి బలవంతంగా ప్లాస్టర్‌తో చుట్టి అరిస్తే చంపేస్తామని బెదిరించి ఆమె ఒంటిపైన, బీరువాలోని బంగారు ఆభరణాలను దోపిడీ చేసిన దుండగులను పట్టుకొని విచారించగా కళ్లు బైర్లు కమ్మే నేరాలు వెలుగులోకి వచ్చాయి. గతనెల 12న నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు వైట్‌కలర్ షిఫ్టు డిజైర్ కారుకు నకిలీ నెంబర్ ప్లేట్లు పెట్టుకొని వైరాలోని సుందరయ్యనగర్‌లో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు వెంకట్రావమ్మను గమనించారు. వెంటనే నలుగురిలో ఒకరు పోలీసు యూనిఫాం ధరించి వారంతా అక్కడకు చేరుకొని ఆమె కుటుంబసభ్యుల గురించి ఆరా తీశారు. మీ కొడుకు అక్రమంగా గంజాయి అమ్ముతున్నాడని, మేము ఒక్కసారి ఇల్లు సోదా చేయాలని బెదిరించి సోదా పేరుతో ఇంట్లోకి ప్రవేశించి ఆమెను నిర్బంధించి ఒంటిమీద, బీరువాలో ఉన్న బంగారపు వస్తువులను దోచుకొని వచ్చిన కారులోనే పరారయ్యారు. కేసు దర్యాప్తులో భాగంగా సీసీ టీవీ ఫుటేజ్, వారు ఉపయోగించిన కారు నెంబర్ ప్లేట్ ఆధారం చేసుకొని వారి ఆచూకీని తెలుసుకున్నారు. ఇదే సమయంలో సోమవారం మధ్యాహ్నం రెండుగంటల సమయంలో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నెమలి, తెలంగాణలోని ఖమ్మంజిల్లా వైరా మండలం దాచాపురం వద్ద ఉన్న అంతర్రాష్ట చెక్‌పోస్టు వద్ద వైరా ఏసీపీ ఎం.ఎ.రెహ్మాన్ పర్యవేక్షణలో సీఐ ఎన్.సాగర్ ఆధ్వర్యంలో వైరా ఎస్ఐ, సిబ్బంది చేపట్టిన వాహనాల తనిఖీల్లో అనుమానాస్పదంగా పట్టుబడిన నలుగురు నేరస్థులను విచారించగా వైరాలో జరిగిన దోపిడీ కేసులో నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ నలుగురు దుండగుల్లో ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరుగా తేలింది. ఈ నలుగురు కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో చాలా ఆర్థిక నేరాలకు, హత్యానేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది.

పట్టుబడిన నిందితులు వీరే..

ఈ కేసులో ప్రధాన నిందితుడు ఏపీలోని పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం కేసనపల్లి గ్రామానికి చెందిన రాయపాటి వెంకయ్య అలియాస్ వెంకటేష్, అలియాస్ వెంకన్న, అలియాస్ దొంగల వెంకన్న, అలియాస్ రెడ్డి. వెంకయ్య గుంటూరులోని కొరటిపాడు చైతన్యపురి మూడో లైన్‌లో కిరాణా షాపు నడుపుతున్నారు. ఇతడిపై మొత్తం 30కేసులున్నాయి. వాటిలో హత్య కేసు ఒకటి, రాబరి కేసు ఒకటి, దొంగతనం కేసులు 28ఉన్నాయి. రెండో నిందితుడిగా ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన షేక్.నాగూల్‌మీరా ఉన్నాడు. ఇతడు వెల్డింగ్ వర్కర్‌గా పనిచేస్తూ నేరాలకు పాల్పడుతున్నాడు. నాగూల్‌మీరాపై మొత్తం పది కేసులున్నాయి. మూడో నిందితుడు ముత్తు అలియాస్ ముత్తురాజ్ మురుగేషన్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వాడు. ఆ రాష్ట్రంలోని ఎరోడ్ జిల్లాలోని మాణిత్యపాలెం జిల్లా మధురైకు చెందిన వాడు. ఇతడు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడిపై మొత్తం 11కేసులున్నాయి. నాలుగో నిందితుడి విజయ్ అలియాస్ విజయ్‌కుమార్ తమిళనాడు రాష్ట్రంలోని ఎరోడ్ జిల్లాకు చెందిన వాడు. ఇతను కూడా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలో నాలుగు కేసులున్నాయి.

స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు..

165.53గ్రాముల బంగారు ఆభరణాలు, పోలీస్ యూనిఫాం(ఎస్ఐ ర్యాంకు ఆఫీసర్), షిఫ్ట్ డిజైర్ కారు నెంబర్ ఏపీ40సీక్యూ0252, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు నకిలీ నెంబర్ ప్లేట్లు, ఒక బ్రౌన్‌కలర్ ప్లాస్టర్, కారు సన్‌షేడ్ కవర్స్ 8, పరీక్ష ప్యాడ్, పెన్ను స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో వైరా తర్వాత కర్ణాటక రాష్ట్రంలోని చల్లాకేర్ ప్రాంతంలో కూడా ఈ నలుగురు నిందితులు దోపిడీకి పాల్పడ్డారు. కర్ణాటక రాష్ట్రంలోని దోపిడీకి సంబంధించిన సొత్తును కూడా వైరా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.బంగారు ఆభరణాలు కరిగించి తయారుచేయించిన 120గ్రాముల ముద్ద, ఏపీ 39యూఎల్0549షిఫ్ట డిజైర్ కారు, మూడు కత్తులు, ఇతర రెండు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 25రోజులు రాత్రింబవళ్లు గాలింపు చేపట్టిన పోలీసులు ఈ దోపిడీ ముఠా ఆటలు కట్టించారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాలతో ఏసీపీ పర్యవేక్షణలో సీఐ ఎన్.సాగర్, వైరా, తల్లాడ, కొణిజర్ల, చింతకాని ఎస్ఐలు వంశీకృష్ణ భాగ్యరాజ్, బి.కొండల్‌రావు, సూరజ్, నాగూల్‌మీరా, వైరా, తల్లాడ ప్రొబేషనరీ ఎస్ఐలు వెంపటి పవన్, బి.వెంకటేష్, పోలీసు సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి ఈ దోపిడీ కేసును ఛేధించారు. పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.



వస్తువులను పరిశీలిస్తున్న సీపీ సునిల్ దత్

లంచగొండి ఆటకట్టు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బార్లు, రెస్టారెంట్లకు సంబంధించిన లైసెన్స్ కనలు కాపీలను ఇచ్చేందుకు రూ.1,500 లంచం తీసుకుంటూ ఓ ఎక్సైజ్‌శాఖ ఉద్యోగి ఏసీబీకి పట్టుబడ్డాడు. లైసెన్స్ పొందిన బార్లు నిర్ణీత కాల వ్యవధిలో రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు 15 రోజుల క్రితం ఆయా జిల్లాల అధికారులను ఈ రెన్యూవల్స్‌కు సంబంధించిన సమాచారం కోరారు. అయితే ఖమ్మం జిల్లాలో అన్ని బార్లు, రెస్టారెంట్లుకు లైసెన్స్‌లు రెన్యూవల్స్ జరిగాయని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు తప్పుడు సమాచారం అందించారు. కానీ తర్వాత ఖమ్మంలోని సాయికృష్ణ, డెలీషియస్ బార్ల లైసెన్స్‌లు రెన్యూవల్ కాలేదన్న విషయాన్ని రాష్ట్రస్థాయి అధికారులు గుర్తించారు.

ఈ నేపథ్యంలో సదరు బార్‌ల లైసెన్స్ రెవెన్యూవల్ చేయించుకోవాలని జిల్లా ఎక్సైజ్ అధికారులు నిర్వాహకులకు ముందుగా నోటీసులు ఇవ్వకుండానే ఫిబ్రవరి 20న నోటీసులు ఇచ్చినట్లు రాసుకొని 28వ తేదీన షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దాంతో సదరు బార్ నిర్వాహకులు తమకు ఎక్సైజ్‌శాఖ ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రాసుకొని నేరుగా షోకాజ్ నోటీసులు ఇచ్చారని కోర్టును ఆశ్రయించారు. అయితే కేసు విచారణ సందర్భంగా సదరు బార్ లైసెన్స్‌కు సంబంధించిన కాపీలు సమర్పించాలని కోర్టు నిర్వాహకులకు సూచించింది. దాంతో ఎక్సైజ్ కార్యాలయంలో ఉన్న బార్ లైసెన్స్ కాపీల కోసం పలుమార్లు బార్ నిర్వాహకులు జిల్లా ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ భూక్య సోమ్లానాయక్‌ను సంప్రదించారు. కానీ లైసెన్స్ కాపీలను ఉచితంగా ఇవ్వడానికి ఆయన నిరాకరించాడు. తనకు రూ.2,000 లంచం ఇస్తేనే నకలు కాపీలు ఇస్తానని తేల్చి చెప్పాడు. దీంతో బార్ నిర్వాహకులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పథకం ప్రకారం మంగళవారం ఖమ్మం జిల్లా ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలోనే సదరు సీనియర్ అసిస్టెంట్ సోమ్లానాయక్ రూ.1,500 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

భట్టి.. లెక్కగట్టి..

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి నెలకొంది. మరో రూ.10వేల కోట్ల అవసరం సీతారామ పనులకు ఈ ఆర్థికసంవత్సరంలో రూ.5వేల కోట్లు అవసరమని ఇంజనీరింగ్‌వర్గాలు పేర్కొంటున్నాయి. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే పనులకు మోక్షం లభించనుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలు తమ నియోజవర్గాలకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

పెదవాగుకు కేటాయింపులు జరిగేనా..

అశ్వారావుపేట మండలానికి చెందిన ఉమ్మడి తెలుగురాష్ట్రాల ప్రాజెక్టు పెదవాగుకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే పనులుజరిగే అవకాశం ఉంది. గత ఏడాది వర్షాలకు పెదవాగు గేట్లు కొట్టుకుపోయిన పరిస్థితి. సుమారు రూ.94కోట్లతో ప్రతిపాదనలుచేసింది. ప్రాజెక్టుసామర్థ్యం అదనపు గేట్లతో ప్రతిపాదనలు చేశారు. ప్రాజెక్టు సాగునీటి ప్రాంతం అధికంగా ఏపీలోని కుకునూరు, వేలేరుపాడు మండలంలో ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో 3వేల ఎకరాలు మాత్రమే ఉంది. మిగిలిన 15వేల ఎకరాలు ఏపీలో ఉండడంతో ఈప్రాజెక్టు ఉమ్మడి తెలుగురాష్ట్రాల ప్రాజెక్టుగా నెలకొంది. బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయా ఉండవా అన్నది ఆసక్తిగా మారింది.

మిగిలిన ప్రాజెక్టులు..

జిల్లాలో తాలిపేరు,కిన్నెరసాని, జాలిముడి, లంక సాగర్, బేతుపల్లి, వైరా, పాలేరు ప్రాజెక్టులకుసంబంధించి మరమ్మత్తులకు కాలువల మరమ్మతులకు నిధుల అవసరం ఉంది. ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు కాలువల అభివృద్ధికి సుమారు రూ.వంద కోట్ల వరకు నిధుల అవసరం ఉంది. ప్రభుత్వం ఎంత వరకు నిధులు మంజూరు చేస్తుందన్నది అధికారులు చెప్పలేకపోతున్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలకు ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మునిసిపల్ పట్టణాలకు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కూడా బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతోనే పనులు జరగనున్నాయి. ఉమ్మడిజిల్లాలో మునిసిపల్ పట్టణాల్లో ప్రజారోగ్యశాఖ ద్వారా మౌలిక సదుపాయాల పనులకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన రోడ్లు, కల్వర్టులు కూడా నిధులు అవసరం ఉంది. ఇంజనీరింగ్‌శాఖలో ప్రతిఏటా ప్రతిపాదనలు తప్ప ఆశించిన కేటాయింపులు లేవు. ఈ సారైనా నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నారు.

శభాష్.. డాక్టర్లు!

- ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో తొలిసారి తుంటి కీలు మార్పిడి
- ఆరోగ్య శ్రీలో ఆపరేషన్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పైసా ఖర్చు కాకుండా తుంటి కీలు ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రి తీసిపోదని నిరూపించారు ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు. తొలిసారిగా తుంటి కీలు ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కారేపల్లి మండలం ఎర్రబొడు మణిక్యరం గ్రామానికి చెందిన గడిబోయిన వెంకటేశ్వర్లు(55) కు గత మూడేళ్లుగా ఎవాస్క్యులర్ నెక్రోసిస్ ఆఫ్ ఫీమొరల్ హెడ్‌వ్యాధి వల్ల రెండు తొంటి కీళ్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి. తీవ్రమైన నొప్పితో బాధపడుతూ నడవడానికే ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలలో మూడు లక్షలకు పైన ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. ఆ ఆపరేషన్‌కు ఆర్థిక స్థోమత లేకపోవడంతో మిన్నకుండిపోయారు. నలుగురు ఆడపిల్లల తండ్రి అయిన వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లోని ఉస్మానియా లాంటి పెద్ద దవాఖానాలకు వెళ్లడానికి సాహసించలేదు. ఆఖరి ప్రయత్నం ఖమ్మంలోని ఆర్థో విభాగం సర్జన్‌లను సంప్రదించారు. దీంతో ఇక్కడి వైద్యులు ఆ రోగిని పరీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యులు మొట్టమొదటి సారిగా సాహసవంతంగా వెంకటేశ్వర్లు సమస్యను తీసుకున్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డాక్టర్ హనుమాన్‌సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ మదన్ సింగ్ తదితరులు తొంటికీలుకి ఆపరేషన్ చేశారు. 'అన్ సిమెంటెడ్ టోటల్ హిప్ రీప్లేస్మెంట్' ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. దీంతో ఆ రోగి పూర్తిగా కోలుకుని నడుస్తున్నారు. తన కాలును బాగుచేసి నడకకు సహకరించిన వైద్యులకు రోగి వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద నగరాల్లో కార్పొరేట్ హాస్పిటల్స్ మాత్రమే సాధ్యమయ్యే ఈ ఆపరేషన్‌ను పూర్తిగా ఉచితంగా ఆరోగ్య శ్రీ ద్వారా రోగికి రూపాయి ఖర్చు కాకుండా చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ తెలిపారు.



ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో కీలు మార్పిడి జరిగి ఆరోగ్యంగా నడుస్తున్న రోగితో వైద్యులు

ఈ నెల 30లోగా అందరికీ రైతు భరోసా

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతులందరికీ రబీకి చెందిన రైతుభరోసా సొమ్మును మార్చి 30వతేదీలోగా పూర్తిగా చెల్లిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమకు ఇంకా రుణమాఫీ కాలేదని కొంతమంది రైతులు మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఇంకా అక్కడక్కడా రుణమాఫీ కానీ మాట వాస్తవమేనని ఆసమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పుణ్యపురం గ్రామంలో రూ.5.45 కోట్లతో నిర్మించనున్న 109 ఇందిరమ్మ పక్కా గృహాలకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి మంత్రి పొంగులేటి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 4.16 లక్షల పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తుందని, ఈ నాలుగేళ్లలో 20 లక్షల ఇండ్లు నిర్మించి పేదలకు గూడు కల్పిస్తామని తెలిపారు. అయినప్పటికీ కళ్లుండి చూడలేని కబోదిలా కేసీఆర్, కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులు తమ సమీపంలోని ఏర్లు, వాగుల నుంచి ఇసుక తోలుకుంటే ఎలాంటి ఇబ్బందులు పెట్టొద్దని పోలీసుశాఖను మంత్రి పొంగులేటి ఆదేశించారు. లబ్ధిదారు లకు ఆర్థిక సహకారం కోసం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. మంత్రిని గ్రామనాయకులు మల్లికార్జున్‌రావు, కృష్ణ, కృష్ణ, కొండలరావు సన్మానించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఆర్డీవో జి.నర్సింహారావు, సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ, తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతీ, కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ బ్రహ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, నాయకులు జైపాల్, బుజ్జీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

'పొగాకు' మాయాజాలం


రైతులు ఆరబెట్టిన పొగాకు పంట

- ధర ఒప్పంద పత్రం ఇవ్వడానికి మీనమేషాలు
- న్యాయం చేయాలంటున్న రైతులు

దుమ్ముగూడెం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు వైపు వెళ్లిన మండల రైతులకు ఎదురుదెబ్బ తగిలింది. మంచి దిగుబడి, లాభాల ఆశ చూపి పొగాకు సాగు చేయించిన ఓ కార్పోరేట్ పొగాకు కంపెనీ రైతును తమ గుప్పిట్లో పెట్టుకొని ఇబ్బందులు పెడుతోంది. సాగుకు ముందు ఒకలా, తీరా పంట చేతికొచ్చే సమయంలో మరోలా కంపెనీ ఆదేశాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. కంపెనీ అర్థాంతరంగా పెట్టిన నిబంధనలతో రైతు నిరాశ, నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. కంపెనీ చెప్పిన విధంగా ఆకు కోసి ఎండ బెట్టడానికి రూ.వేలాది అదనపు ఖర్చుతోపాటు, కూలీల ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారు. క్వింటాకు రూ.17,300ల ధర చెల్లిస్తామని చెప్పిన కంపెనీ సిబ్బంది పంట సాగు చివరి దశకు వచ్చినా ధర ఒప్పంద పత్రాలు ఇవ్వక పోవడం గమనార్హం. సదరు కంపెనీ ఒంగోలులో ఇటీవల సమావేశం నిర్వహించగా, రైతులు తమ ఇబ్బందులను తెలపడంతో పాటు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేసేటప్పుడు ఒకలా.. కోసేటప్పుడు మరోలా!

ఏపీ రాష్ట్రం ఒంగోలు కేంద్రంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్న ఓ పొగాకు కంపెనీ దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పొగాకు పంటను సాగు చేయించింది. రైతును సాగుకు దింపే ముందు రెండు ఆకులను కాడతో కలిపి లింకు కోత కోసి ఎండబెట్టి ఇస్తే చాలని చెప్పారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి రెల్లి కోత(ఆకులను విడి విడిగా చేసి)కోసి కాండం లేకుండా ఎండబెట్టి ఇవ్వాలనే డిమాండ్ తెచ్చారు. లింకు కోత కోసి ఆరబెట్టిన పొగాకుకు క్వింటాకు రూ.17,300ల ధర చెల్లిస్తామన్నారు. దీంతో చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులు మిర్చి పంటకు ప్రత్యామ్నాయంగా పొగాకును సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి కంపెనీ సిబ్బంది పలు రకాల ఆంక్షలను రైతుల నెత్తిన రుద్దుతున్నారు. రైతులు చేసేదేమీ లేక వ్యయ ప్రయాసలకోర్చి కంపెనీ చెప్పిన విధంగా ఆకు కోసి ఎండబెట్టడానికి అంగీకరించారు. ఇలా కోత కోస్తే దిగుబడి తగ్గడంతోపాటు, కూలీలకు అదనంగా ఖర్చులౌతాయి. ఇటీవల ఒంగోలులో రైతులతో కంపెనీ నిర్వహించిన సమావేశంలో గతంలో ప్రకటించిన ధరకు అదనంగా చెల్లిస్తామని అంగీకరించారు. అదనంగా ఎంత చెల్లిస్తారనే విషయాన్ని ఈనెల 6న సరిహద్దు ఏపీ రాష్ట్రం గొరిదేవిపేటలో సమావేశం నిర్వహించి ప్రకటిస్తామన్నారు. సమావేశం పెట్టకపోగా, 12కు వాయిదా వేసినట్లు చెబుతున్నారు. కంపెనీ తీరుతో విసిగి వేసారిన రైతన్నలు లాభ, నష్టాలకు సిద్ధపడి అదనపు వ్యయ, ప్రయాసలతో కోతకు సిద్ధమయ్యారు.

ఆందోళనలో పొగాకు రైతులు!

లింకు కోత కోసి ఆరబెట్టిన రైతులను కంపెనీ పెట్టిన మధ్యంతర ఆంక్షలు నిరాశ నిస్పృహలకు గురిచేశాయి. ఇప్పటికే లింకు కోత కోసి ఎండబెట్టిన రైతులు, కంపెనీ చెప్పిన విధంగా మళ్లీ ఆకులు రెల్లి ఇవ్వడానికి నానా పాట్లు పడుతున్నారు. సాగు ఖర్చు ఇబ్బడి ముబ్బడిగా పెరగ్గా, కనీసం పెట్టుబడి కూడా వస్తుందో లేదో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తాము తప్ప ఎవరు కొనరనే ధీమాను కార్పోరేటు కంపెనీ ప్రదర్శిస్తుండగా, సాగు చేశాం కాబట్టి ఏదో ధరకు విక్రయించాలనే ఆరాటంలో రైతులు కన్నీరు మున్నీరౌతున్నారు.

కంపెనీ తీరు అర్థం కావడం లేదు

మంచి లాభాలొస్తాయని తమతో సాగు చేయించిన పొగాకు కంపెనీ వ్యవహారం అర్థం కావడం లేదని సీతారాంపురం రైతు అన్నె సత్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. రైతులతో కంపెనీ చేసుకున్న ఒప్పందానికి, చేయిస్తున్న పనికి సంబంధం లేదని తెలిపారు. మొదట లింకు కోత కోయమని చెప్పిన కంపెనీ సిబ్బంది, పంట చేతికొచ్చే సమయానికి ఆకులను రెల్లి ఇవ్వమనడం ఏమిటని ప్రశ్నించారు. నేటికీ ఒప్పంద పత్రం చేతికివ్వకపోగా, అదనపు ధర విషయం తేల్చకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఆహ్వానం

భద్రాచలం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న కిన్నెరసాని(బాలురు), కచనపల్లి(బాలికలు), వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయనపల్లి హైదరాబాద్‌లో క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ఈ ప్రవేశాలకు డివిజన్‌స్థాయి ఎంపికలు ఈ నెల 16 నుంచి 25 వరకు, జిల్లాస్థాయిలో ఎంపికలు 26 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాలకు 9 నుంచి 11 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని గిరిజన విద్యార్థులు అన్ని ధృవీకరణ పత్రాలతో మార్చి 17 నుంచి భద్రాద్రి జిల్లా విద్యార్థులు మోడల్ స్పోర్ట్స్ స్కూల్, కిన్నెరసాని, ఖమ్మం విద్యార్థులు ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉనరికాయలపల్లిలో సంప్రదించాలని కోరారు.

కిష్టారంలో గ్రామస్థుల రైల్‌రోకో

సత్తుపల్లిరూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): సైలోబంకర్‌ను తొలగించాలని కోరుతూ 30వరోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలో భాగంగా మంగళవారం సీహెచ్‌పీ వద్ద గ్రామస్థులు బొగ్గు లోడింగ్‌ను అడ్డుకుని రైల్‌రోకో నిర్వహించారు. శాంతియుతంగా దీక్షలు చేపట్టినా సింగరేణి సంస్థకు ఎలాంటి చలనం లేదని, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల వారు శిబిరాన్ని సందర్శించి హామీలు ఇస్తున్నారేగానీ ఆచరణకు నోచుకోవడం లేదని ఆందోళనకారులు వాపోయారు. సైలోబంకర్ కాలుష్యం కారణంగా అంబేద్కర్ నగర్, బీసీ కాలనీలో సుమారు 40మంది మృతిచెందగా దీక్షలు చేపట్టినప్పటి నుంచి నలుగురు మృతి చెందిన శ్వాసకోశం సంబంధిత సమస్యలతో 10మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అన్నారు. తమకు శాశ్విత పరిష్కారంగా పునరావాసం కానీ, సైలోబంకర్‌ను తొలగించడం కానీ చేయాలని గ్రామస్థులంతా కోరారు. మా భూములలో బొగ్గును వెలికితీస్తూ, మా భూముల్లో సీహెచ్‌పీని నిర్మించి బొగ్గు రవాణా చేయడమే కాకుండా మాపై కాలుష్యాన్ని వదిలి మమ్మల్ని అనారోగ్యం పాలు చేస్తున్న సింగరేణి సంస్థ వెంటనే దిగిరావాలని డిమాండ్ చేశారు.

పారిపోయాడు.. పట్టుబడ్డాడు..

సత్తుపల్లి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అతడు ఓ విచారణ ఖైదీ.. సబ్‌జైలులో నెలరోజులుగా ఉంటున్నాడు.. అధికారుల కళ్లుగప్పి 18 అడుగుల ఎత్తులో ఉన్న జైలు గోడదూకి పరారయ్యాడు.. అయితే మూడు గంటల్లోనే పోలీసులు అతడిని పట్టుకొని మళ్లీ జైలుకు తీసుకువచ్చారు. ఈ సంఘటన సత్తుపల్లిలో సబ్‌జైలులో మంగళవారం చోటుచేసుకుంది. జిల్లా సబ్‌జైళ్ల అధికారి బి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

గతనెల 3వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఆసుపాకకు చెందిన పెంద్ర రమేష్.. భార్యపై హత్యాయత్నం కేసులో సత్తుపల్లి సబ్‌జైల్‌కు విచారణ ఖైదీగా వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 10గంటల సమయంలో జైలు అధికారుల కళ్లుగప్పి 18 అడుగుల ఎత్తులో ఉన్న జైలు గోడదూకి పరారయ్యాడు. దీంతో జైల్ సిబ్బందితో పాటు సత్తుపల్లి పోలీసులు 10మంది రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆంధ్రాలోని చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో బంధువుల ఇంట తలదాచుకున్న రమేష్‌ను ఎపట్టుకున్నారు. అనంతరం సత్తుపల్లి సబ్ జైల్‌కు తీసుకువచ్చామని, విచారణ ఖైదీపై ఐపీసీ 229ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి సబ్‌జైల్ సూపరింటెండెంట్ సోమరాజు ప్రవీణ్ ఉన్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో..

ఆంధ్రాలోని ఈస్ట్ గోదావరి జిల్లా గోపాలపురానికి చెందిన పెంద్ర రమేష్ ప్లాస్టిక్ డబ్బాలను అమ్ముకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆసుపాకలో భార్య, దుర్గ, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. గతేడాది డిసెంబరు 7న అర్థరాత్రి భార్యపై మంచంపట్టెతో తలపై మోది హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలైన భార్య ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేయగా రమేష్‌ను ఫిబ్రవరి 3 అరెస్ట్ చేసి సత్తుపల్లి సబ్‌జైల్‌కు రిమాండ్‌కు తరలించారు. కాగా రమేష్ గోడదూకి పారిపోలేదని, సబ్ జైల్ అధికారులు అతణ్ని జైలు బయట గార్డెన్ శుభ్రం చేయించేందుకు తీసుకురాగా ఇదే అదనుగా భావించి సిబ్బంది కళ్లుగప్పి పరారయ్యాడని తెలిసింది. ఎలాగోలా మూడు గంటల్లోనే బంధువుల ఇంట్లో పట్టుబడటంతో కథ సుఖాంతమైంది. అయితే పట్టుకునే సమయంలో రమేశ్ పోలీసులపై కర్రలతో దాడిచేయగా, పోలీసులు చాకచక్యంగా అడ్డుకొని పట్టుకుని తీసుకువచ్చినట్టు తెలిసింది.

బోరు పనులను అడ్డుకున్న గిరిజనులు

- అటవీ అధికారులు, గిరిజనుల మధ్య వాగ్వాదం
- రోడ్డుపై బైఠాయించి ఆందోళన..
- వాహనం సీజ్‌చేసిన రెవెన్యూ అధికారులు


రహదారిపై ఆందోళన చేస్తున్న గిరిజనులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగూడెం సమీపంలో గల టేకు ప్లాంటేషన్‌లో అటవీశాఖ అధికారులు బోరు వేస్తుండగా గిరిజనులు అడ్డుకున్నారు. ప్లాంటేషన్‌పై అటవీ అధికారులు, గిరిజనుల మధ్య కోర్టు కేసులు నడుస్తున్న తరుణంలో అధికారులు బోరు వేయటానికి ప్రయత్నించగా అడ్డుకుని పనులు ఆపారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గిరిజనులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. మండలంలోని రామన్నగూడెం సమీపంలో టేకు ప్లాంటేషన్ ఉంది. ఈ భూమిలో తమకు తాత ముత్తాతల నుంచి పట్టాలు ఉన్నాయని, గిరిజనుల భూముల్లో అటవీ అధికారులు ప్లాంటేషన్ వేశారని గిరిజనులు కోర్టుకు వెళ్లారు. కొంతకాలంగా కేసులు కొనసాగుతున్నాయి. ఇదే తరుణంలో మంగళవారం అటవీ శాఖ అధికారులు ప్లాంటేషన్‌లో బోరు వేస్తుండగా గిరిజనులు అక్కడకు చేరుకుని పనులను ఆపారు. స్టేటస్ కో ఉన్న భూమిలో మీరు పనులు ఎలా చేస్తారంటూ అటవీ అధికారులను ప్రశ్నించి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఇదే సమయంలో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. తమ భూమిలో ప్లాంటేషన్ వేసి తమకు భూములు లేకుండా చేసారంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామ్మూర్తి అక్కడకు చేరుకుని గిరిజనులతో మాట్లాడారు. రెవెన్యూ శాఖ ద్వారా సర్వే చేయాలని కోరారు. రెవెన్యూ అధికారులు వస్తామని తెలిపి ఆ తరువాత మరో రెండు రోజులు సమయం కావాలని సమాచారం అందించారు. దీంతో మరోసారి గిరిజనులు రోడ్డుపై బైటాయించారు. సర్వే చేసి తమ భూమిని తమకు అప్పగించేవరకు నిరసన చేస్తామని నాయకులు మడకం నాగేశ్వరరావు తెలిపారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని గిరిజనులు వాపోయారు. అధికారులు తమ భూమిని తమకు అప్పగించాలని కోరారు.

వాహనం సీజ్

వివాదం నడుస్తున్న భూమిలో అటవీ అధికారులు బోరు వేస్తుండటం, గిరిజనులు అడ్డుకుని ఆందోళన చేయటంతో రెవెన్యూ అధికారులు బోరు వేసే వాహనాన్ని సీజ్ చేశారు. ప్లాంటేషన్ వద్దకు వచ్చిన ఆర్ఐ కృష్ణ, పోలీసులు బోరు వేసే వాహనాన్ని సీజ్‌చేసి రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. వివాదం నడుస్తున్న భూమిలో బోరు వేస్తున్నందున సీజ్ చేసినట్లు ఆర్ఐ కృష్ణ తెలిపారు.

వ్యవసాయానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రతీ ఏడాది కుదింపు

- నల్ల చట్టాలను పరోక్షంగా అమలు చేస్తున్న కేంద్రం
- పూర్తిగా రద్దు చేసే వరకూ పోరాటాలు చేస్తాం
- టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు 'బాగం'



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల చేతిలో పెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, నల్ల చట్టాలను పరోక్షంగా అమలు చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. మంగళవారం వీ వెంకటాయపాలెంలో నిర్వహించిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో 50శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, అంతటి ప్రాధాన్యత కలిగిన రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఢిల్లీలో ప్రాణత్యాగాలు చేసి నల్ల చట్టాలను అడ్డుకుంటే మరోసారి పరోక్షంగా కేంద్రం ప్రభుత్వం వాటిని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం వ్యవసాయ రంగానికి బడ్జెట్ కుదింపు చేస్తున్నారని ఆరోపించారు. ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేసి క్వింటా రూ.25వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ధరణి పేరుతో రైతులను దగా చేశారని, పోడు రైతుల భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి భూమికి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, శాఖమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై మరో బాలుడి లైంగిక దాడి

ఖమ్మం క్రైం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ బాలునిపై మరో బాలుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటనపై ఖమ్మం ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసునమోదైంది. ఖానాపురం హవేలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర పరిధిలోని టేకులపల్లి కేసీఆర్ డబుల్‌బెడ్ రూమ్స్‌లో నివాసముండే ఏడు సంవత్సరాల బాలుడిపై అదే ప్రాంతంలో నివాసముండే 14సంవత్సరాల బాలుడు లైంగికదాడికి పాల్పడాడు.

సోమవారం సదరు బాలుడిని 14 సంవత్సరాల బాలుడు బయటకు తీసుకెళ్లి ఓ ఖాళీ స్థలంలో లైంగికదాడికి పాల్పడ్డాడు. లైంగికంగా వేధింపులకు గురైన బాలుడు తను ఇంటికివచ్చి కుటుంబ సభ్యులకు చెప్పటంతో వారు సదరు బాలుడి ఇంటికి వెళ్లి అడిగారు. దీంతో ఇరువురూ గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం లైంగిక దాడికి గురైన బాలుని కుటుంబ సభ్యులు ఖానాపురంహవేలి పోలీసులకు ఫిర్యాదుచేశారు. అనంతరం బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసినట్లు ఖానాపురం హవేలి సీఐ భానుప్రకాష్ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో గందరగోళం

- శాఖల మధ్య సమన్వయ లోపం
- క్లియర్స్‌ల కోసం దరఖాస్తుదారుల ఇబ్బందులు
- 31లోపు చెల్లిస్తే 25శాతం రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- ఎంత చెల్లించాలో తెలియక అయోమయం

అశ్వారావుపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అనుమతుల్లేని ప్లాట్లను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం) అమలు గందరగోళంగా మారింది. ఈ కార్యక్రమం అమలులో ఏం జరుగుతోందో అర్థం కాక ప్రజలు అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వం ఒక వైపు మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించినవారికి 25శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించినా క్షేత్రస్థాయిలో మాత్రం ఎల్‌ఆర్‌ఎస్ కోసం చేసిన దరఖాస్తులు ఇంకా ప్రాసెసింగ్ దశలోనే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుదారుడు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలంటే పంచాయతీ/మునిసిపాలిటీ క్లియరెన్స్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల క్లియరెన్స్ పొందాల్సి ఉంటుంది. క్లియరెన్స్‌ల కోసం ప్లాట్ల యజమానులు ఈ మూడు శాఖల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. దరఖాస్తులు ఒకేచోట ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉండిపోతున్నాయి.

మూడుశాఖల చుట్టూ ప్రదక్షిణలు..

ఎల్‌ఆర్‌ఎస్‌కు పంచాయతీ/మునిసిపాలిటీ క్లియరెన్స్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల క్లియరెన్స్ తప్పనిసరిగా పొందాలి. ఈ నేపథ్యంలో సింగిల్ విండో విధానంలో అనుమతులివ్వకుండా ప్లాటు యజమానే ఆయా శాఖల అధికారులను కలిసి అనుమతులు పొందాల్సి రావడంతో దరఖాస్తులపై కసరత్తులో చాలా జాప్యం జరుగుతోంది. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆగస్టు 2020 నాటికి అశ్వారావుపేట మండలంలో 2,318, దమ్మపేటలో 236 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో చెరువులు, ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూముల్లో ప్లాట్లు ఉంటాయనే



ఉద్దేశంతో ప్రభుత్వం ఆయాశాఖల క్లియరెన్స్ పొందాలనే నిబంధన పెట్టింది. అయితే ఆయా శాఖల వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడం సులభమైన పనే.. కానీ అధికారులు అందరూ కలిసి సింగిల్‌విండో విధానంలో అనుమతులు ఇవ్వకుండా ఒకరి తరువాత ఒక శాఖకు దరఖాస్తులు వెళ్లడం, వారు దరఖాస్తుదారులను పిలిపించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాతనే క్లియరెన్స్ ఇస్తుండటంతో ఇప్పటి వరకు దరఖాస్తుల పరిశీలనే పూర్తికాలేదు. వచ్చిన దరఖాస్తుల్లో 20శాతం దరఖాస్తులు కూడా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించే దశకు చేరుకోలేదు. అత్యవసరమైన ప్లాట్ల యజమానులు పదుల సంఖ్యలో ఆయా శాఖల చుట్టూ తిరిగి అనుమతులు తెచ్చుకున్నారు. అయినా వారు చాలా వ్యయ ప్రయాసలు ఎదుర్కొన్నారు.

ఎంత చెల్లించాలి.. ఎవరు చెల్లించాలి ?

భూమిని రెగ్యులర్ చేయడానికి ప్లాటు యజమాని ఎంత చెల్లించాలి, ఏ విధంగా చెల్లించాలి, ఫీజును ఏ విధంగా నిర్ణయిస్తారనే దానిపై స్పష్టత లేదు. ఒక ఫార్మాట్‌లో ఆన్‌లైన్ చేస్తే అందులోనే ఓపెన్ స్పేస్ ఎంత కట్టాలి, రెగ్యులైజేషన్ చార్జ్ ఎంత చెల్లించాలో వస్తుందని, దాని ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే అసలు ఈ ఫీజును ఎలా నిర్ణయిస్తారో తెలియడం లేదు. ఎంత చెల్లించాలో వివరిస్తూ దరఖాస్తుదారురులకు నోటీసులు కూడా జారీ కాలేదు. అధికారుల వద్ద ఈ సమాచారం లేకపోవడంతో ఆన్‌లైన్ చేసిన తరువాత లక్షల్లో ఫీజు వస్తే ఏం చేయాలనే ఆందోళనలో భూ యజమానులు ఉన్నారు. అత్యధిక ధర ఉంటే ఇరవై ముప్పై సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లుకు దానిపై నాలుగైదు రెట్లు అధికంగా చెల్లించాల్సివస్తే ఏం చేయాలనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే అధికారులు మాత్రం భూమి కొనుగోలు చేసిన డాక్యుమెంట్‌లో దాని విలువ, 2020లో దరఖాస్తు చేసిన నాటి విలువను బేరీజు వేసుకొని ప్రభుత్వం ఫీజు నిర్ణయిస్తుందని, ఇందులో ఎవరి ప్రమేయం ఉండదని, ఫార్మాట్‌లో ఆటోమేటిక్‌గా ఫీజు జనరేట్ అవుతుందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రజలను తీవ్ర గందరగోళంలో పడేస్తున్నాయి. మరో ఇరవైరోజుల్లో చెల్లిస్తేనే రాయితీ ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనల నేపథ్యంలో అంతా గందరగోళంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం సింగివిండో విధానంలో దరఖాస్తుదారులు ఆయా శాఖల చుట్టూ తిరగకుండా అనుమతులు వచ్చేలా చూడాలని, ఫీజు ఎంత చెల్లించాలో ఆయా దరఖాస్తుదారుడికి మెస్సేజ్ కానీ నోటీసుల ద్వారా కానీ సమాచారం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై అశ్వారావుపేట మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా పట్టణంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం మొత్తం 2,318 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటి వరకు 250వరకు ఆన్‌లైన్ పూర్తయిందని తెలిపారు. ప్లాటు కొనుగోలు చేసిన సమయంలో డాక్యుమెంట్, 2020నాటికి దరఖాస్తు చేసినప్పుడు ఉన్న మార్కెట్ ధరను రెండింటిని బేరీజు వేసుకొని ఫీజు ఎంత చెల్లించాలో ఫార్మాట్ పూర్తిచేయగానే తెలుస్తుందని, ముందుగా తెలియదని తెలిపారు. ప్రతి ప్లాట్‌కు ఓపెన్ స్పేస్ చార్జీలు, రెగ్యులైజేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రుణమాఫీ ఇంకా జరగాల్సింది వాస్తవం

ఇది పేదోడి కన్నీళ్లను తుడిచే ప్రభుత్వం: మంత్రి పొంగులేటి


సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఇంకా కొంత మంది రైతులకు రుణ మాఫీ జరగాల్సిన మాట వాస్తవమని, అదీ త్వరలోనే పూర్తి చేస్తామని పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేయటంతో పాటుగా ప్రారంభోత్సవాలు చేశారు. నాచేపల్లి గ్రామంలో సీసీరోడ్డుకు శంఖుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామన్నారు. ఇది పేదోడి కన్నీళ్ల తుడిచే ప్రభుత్వమన్నారు. నా ఆడబిడ్డలు ఇంట్లో నుంచి కాలు బయటపెడితే, కాలికి మట్టి అంటకుండా తిరిగి ఇంటికెళ్లాలని, అందుకే ఎక్కడా మట్టి రోడ్డు లేకుండా, అన్నీ సీసీ రోడ్డు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. నాలుగు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వటం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, ఆకుల శేఖర్, ధనమూర్తి, ధీరావత్ బాలాజి తదితరులు పాల్గొన్నారు

'గ్రూప్-2'లో గిరిజన విద్యార్థికి 14వ ర్యాంకు



ఏన్కూరు, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండల భగవాన్‌నాయక్‌తండా గిరిజన గ్రామానికి చెందిన ధరావత్ వెంగళరావు మంగళవారం ప్రకటించిన గ్రూప్ 2 ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. జనరల్ కేటగిరిలో 277, ఎస్టీ కేటగిరిలో 14వ ర్యాంకు సాధించడం విశేషం. తల్లిదండ్రులు ధరావత్ బాల, బుజ్జి కూలి పనులు చేస్తూ చదివించారు. వెంగళరావు చిన్ననాటి నుంచి చదువుల్లో చురుకుగా ఉండేవాడు.

ఫలించిన పట్టుదల.. వరించిన ఉన్నత ఉద్యోగం



తల్లాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే మరోవైపు ఉన్నత ఉద్యోగం సాధించాలనే యువకుడి పట్టుదల ఫలించింది. నాల్గో ప్రయత్నంలో ఉన్నత ఉద్యోగం వరించింది. తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర వెంకటేశ్వరరావు మంగళవారం విడుదలైన గ్రూపు-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 148వ ర్యాంకు, జోనల్‌లో 20వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం వెంకటేశ్వరరావు విద్యుత్‌శాఖలో జూనియర్ అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరరావు బాల్యంలోనే తండ్రి కాలేశ్వరరావు ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. తల్లి రుక్మిణమ్మ వ్యవసాయ కూలీపనులు చేస్తూ వెంకటేశ్వరరావును చదివించారు. తల్లి ప్రోత్సాహంతో వెంకటేశ్వరరావు బీకాం వరకు చదివాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తొలి ప్రయత్నంలో 2018వ సంవత్సరంలో గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ఆ ఉద్యోగం చేస్తూనే 2019లో రెండో ఉద్యోగ ప్రయత్నంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా, 2020లో మూడో ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా విద్యుత్ శాఖలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎంపికై ప్రస్తుతం ఆ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ తాజాగా గ్రూపు-2 రాసి 387.5మార్కులు సాధించి ఉన్నత ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పట్టుదలతో ప్రతిభను చాటుకొని గ్రూపు-2లో మంచి మార్కులు సాధించిన వెంకటేశ్వరరావుకు అభినందనలు వెల్లువెత్తాయి.

రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన పంకజ్



కల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన కుమ్మర పంకజ్ గ్రూపు-2 సర్వీస్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 47 ర్యాంకు సాధించాడు. చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన కుమ్మర ప్రభాకర్‌రావు, కృష్ణప్రియ దంపతులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారి కుమారుడైన పంకజ్ గత ఏడు సంత్సరాల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ హిస్టరీ పూర్తి చేశాడు. నాటి నుంచి పంకజ్ గ్రూప్సు కొలువులపై దృషి సారించాడు. పట్టుదలగా చదివి గత ఏడాది క్రితం నిర్వహించిన పలు ఫలితాల్లో అర్హత సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్‌గా, గురుకుల విద్యాసంస్థలో డిగ్రీ లెక్చరర్‌గా, గ్రూపు-4లో కూడ మరో కొలువును సాధించాడు. తాజాగా ప్రటించిన గ్రూపు-2 సర్వీస్‌లో కూడ రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించటం పంకజ్ పట్టుదల, అంకిత భావానికి నిదర్శనంగా చెప్పవచ్చు. తమ కుమారుడు పై విధంగా కొలువులు సాధించటం ఆనందగా ఉందని ప్రభాకర్‌రావు, కృష్ణప్రియలు అంటున్నారు. విశ్రాంత ఏఎస్ఐ కుమ్మర రామారావుతో పాటుగా పలువురు పంకజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరేందుకు సిద్ధం కానున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు.

ప్రతిభ చాటిన గోపాలరావు



బోనకల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ముందు పేదరికం తలొగ్గింది. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ చదివించిన పరిస్థితులు లక్ష్యం వైపుకు నడిపించాయి. ఒకటి కాదు నాలుగు కొలువులు సాధించి అందరికి ఆదర్శంగా నిలిచాడు. బోనకల్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన కోట గురవయ్య, లక్ష్మీ దంపతుల కుమారుడు గోపాలరావు ఇప్పటికే మూడు కొలువులు సాధించాడు. గ్రూఫ్ 2 ఫలితాల్లో 652 ర్యాంకు సాధించాడు. జోనల్ పరిదిలో ఎస్సీ క్యాటగిరి కింద 6వ ర్యాంకు వచ్చింది. మంచి క్యాడర్ పోస్టు రానున్నట్లు గోపాలరావు తన అభిప్రాయాన్ని ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఐదుగురు బిల్ కలెక్టర్లకు షోకాజ్ నోటీసులు

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ ఆదాయ వసూళ్లపై నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన బిల్ కలెక్టర్లకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎం నాగరాజు, ఎం వీరబాబు, వై సాయిరాం కృష్ణ, బీ.వస్త్రం, కే.ఉప్పలి సిబ్బందికి కేటాయించిన ప్రాంతాల్లో ఆదాయ వసూళ్ల లక్ష్యం నెరవేరలేదు. దీంతో స్పందించిన కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గడువు ముగింపులోపుగా ఆదాయ వసూళ్ల లక్ష్యం పూర్తి కావాలని రెవెన్యూ సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు.

14 నుంచి అంకమ్మ తల్లి జాతర

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి11(ఆంధ్రజ్యోతి): 1వడివిజన్ కైకొండాయిగుడెం వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మల ఆలయంలో ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఆలయ కమిటి తెలిపింది. ఏటా హోలీ పండుగ రోజు నుంచి అమ్మవార్ల జాతర ప్రారంభిస్తారు. 14న పంచామృత సహిత విశేష అభిషేకం, అలంకరణ, బోనాలు సమర్పించటం, 15న గణపతి పూజ, లలిత సహస్రనామ పారాయణం, సామూహిక కుంకమ పూజ, 16న ఆలయ



వార్షికోత్సవం సందర్భంగా దేవీహోమము, అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

14 వరకు మహాలక్ష్మీ అమ్మవారి జయంతి ఉత్సవాలు

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో కొలువైఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనట్లు ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రావు, ఆలయ ప్రధాన అర్చకుడు నరహరి నరసింహాచార్యులు తెలిపారు. ఈనెల10 నుంచి 14వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం అభిషేకం, అగ్ని ప్రతిష్ట, అష్టలక్ష్మీ యాగం, కుంకుమ పూజలు నిర్వహించారు. 12న ప్రత్యేక అలంకరణ, వ్యాపారాభివృద్ధి హోమం, 13న అష్టలక్ష్మీ యాగం, 14న పుష్పయాగం,అన్నదానం, రాత్రి శ్రీలక్ష్మీ కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని చెప్పారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు పది కౌంటర్లు

- ప్రతీ కౌంటర్‌లో వార్డు ఆఫీసర్, ఇతర సిబ్బంది
- దరఖాస్తుదారుల అనుమానాలు నివృత్తి చేసిన కమిషనర్



దరఖాస్తుదారుల అనుమానాలు నివృత్తి చేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమ విభాగం,మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు సమీపించేకొద్దీ దరఖాస్తుదారుల తాకిడి పెరిగింది. సాధారణ సమయంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు పదిమంది కేఎంసీ కార్యాలయానికి రాగా మూడు రోజులు నుంచి రోజుకు 400 మంది వరకు వస్తున్నారు. స్పందించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య ఖమ్మంలో ప్రత్యేకంగా ఎల్‌ఆర్‌ఎస్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రధాన సెంటర్లలో ఎల్‌ఆర్‌ఎస్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రజలు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి రాకుండానే స్థానికంగా ఏర్పాట్లు చేశారు. ప్రతీ కౌంటర్‌లో వార్డు ఆఫీసర్‌తో పాటుగా ఇతర సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు సమీపంలోనే ఉన్న కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య కోరారు.

నగరంలో ఎల్‌ఆర్‌ఎస్ కేంద్రాలు

- అంజనేయస్వామి ఆలయం, బుర్హన్‌పురం,
- కమాన్ బజార్, షాదిఖానా
- గాంధీపార్క్‌మామిళ్లగూడెం
- అయ్యప్ప స్వామి దేవాలయం శ్రీనివాస్‌నగర్
- సంభాని నగర్
- కొల్లిపాక ఫంక్షన్‌హాల్
- ఇందిరానగర్
- వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ వీడియోస్ కాలనీ
- గొల్లగూడెం

కేఎంసీలో హెల్ప్ డెస్క్

సాధారణ సేవల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ వరకు..

ఖమ్మంసంక్షేమవిభాగం:ఖమ్మంనగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. కార్యాలయంలోకి అడుగు పెట్టిన ప్రజలకు ఏదైనా సమాచారం కావాలంటే హెల్ప్ డెస్క్ నుంచి అందుతోంది. అలాగే కార్యాలయంలోని విభాగాల సమాచారం, అధికారుల వివరాలు హెల్ప్ డెస్క్ నుంచి అందిస్తారు. సాధారణ సేవల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ వరకు అనేక అంశాలను సిబ్బంది ద్వారా తెలుసుకొవోచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు.

52 ఏళ్ల తర్వాత కలిసిన మిత్రులు



మిత్రుడిని సత్కరిస్తున్న సహచరులు

ఖమ్మంకలెక్టరేట్,మార్చి12(ఆంధ్రజ్యోతి): వారంతా 52ఏళ్లక్రితంవిద్యార్థులు... ఇప్పుడు మనవళ్లు... మినపరాళ్లతో గడుపుతున్న సమయంలో తాజాగా మళ్లీ కలుసుకున్నారు. ఈఆపూర్వ కలయిక మంగళవారం నగరంలోని ప్రైవేటు హోటల్లో జరిగింది. ఎస్సారిబీజీఎన్నార్ కళాశాలలో 1968-72లో డిగ్రీ చదివిన బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విధులు, బాధ్యతలతో ఒత్తిడిగా గడుపుతున్న వారంతా కలుసుకున్నారు. ఆత్మీయంగా మాట్లాడు కున్నారు. అప్పటి జ్ఞాపకాలను మననం చేసుకుని సేదతీరారు.. సూర్యపేట జిల్లాలో రూ.5 ఫీజుతో వైద్య సేవ చేస్తున్న ప్రజావైద్యుడు రంగారెడ్డిని ఈ సందర్భంగా సహచర మిత్రులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వెంకటనారాయణ, వెంకట్రావు, పుల్లారావు, టి .నర్సింహారావు, ఈ కోటేశ్వరరావు, ఆర్ సైదులు, కె.వెంకటేశ్వరరావు, పి.సీతారామయ్య, సీతారాములు, సీహెచ్ రామయ్య, హఫీజ్,ఆర్వీ ప్రకాష్, కె సబ్బారావు, ప్రహ్లాదరెడ్డి, వీవీఎల్ఎన్ శర్మ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న కేరళ నంబూద్రీలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్‌లోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం విగ్రహప్రతిష్ఠ పూజలు ప్రారంభించారు. కేరళ నుంచి విచ్చేసిన తంత్రి తక్కే. కోరమంగళం దామోదరన్ నంబూద్రి, పాతికల్లం నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలతో ప్రారంభమైనట్లు ఆలయ చైర్మన్ మేకల హనుమంతరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహాన్ని చైర్మన్ హనుమంతరావు కుటుంబ సభ్యులు, నాగేంద్ర స్వామి విగ్రహాన్ని పదో డివిజన్ కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు కుటుంబ సభ్యులు, విగ్నేశ్వరస్వామి విగ్రహాన్ని వీర వసంత కుమార్ కుటుంబ సభ్యులు, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని పుల్లంరాజు కుటుంబ సభ్యులు, మాలికాపురత్తమ్మ అమ్మవారి విగ్రహాన్ని 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమాసతీష్ తండ్రి బాబురావు కుటుంబ సభ్యులు సమర్పించారు. పలువురు దాతలు పూజల్లో పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, మార్చి11(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. మండలంలోని ఏనుకుంట తండాకు చెందిన బానోతు సోములు (30) వ్యవసాయకూలీగా పనిచేస్తున్నాడు. గ్రామం నుంచి కాకరవాయికి ద్విచక్రవాహనంపై నిత్యం పనికి వెళుతుంటాడు. ఈక్రమంలో ద్విచక్రవాహనంపై ఏనుకుటుతండాకు వస్తుండగా ఎదురుగా కూలీలతో వస్తున్న ట్రాక్టర్‌వచ్చి ఢీకొట్టింది. దీంతో సోములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడాది క్రితం వివాహమైంది. అతడికి 45రోజుల కుమారుడున్నారు. సోములు మరణంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు ఘటన స్థలం సందర్శించి వివరాలు సేకరించారు, కేసు నమోదు చేశారు.

మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన

నేలకొండపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత అనాసాగరంలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం గతనెల 23న వివాహం జరిగిన కాంగ్రెస్ నాయకుడు షైసా శంకర్ ఇంటికి వెళ్లినూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను బహుకరించారు. చెర్వుమాధారంలో సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును మంత్రి ప్రారంభించారు. చెన్నారంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన గోడౌన్‌ను ప్రారంభించారు. ఆరెగూడెంలో సోమవారం మృతి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కొమ్మినేని జగ్గయ్య, మూటాపురంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఏలూరి సురేష్‌ల కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పలుగ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్నివర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇది పేదోడి ప్రభుత్వమని, పేదోడి కన్నీళ్లను తుడుస్తుందన్నారు. కార్యక్రమంలో మువ్వా విజయ్ బాబు, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, గుడిమళ్ళ మధు, బొల్లినేని వెంకన్న, వందనపు నాగేశ్వరరావు, బొడ్డు బొందయ్య, కుక్కల హనుమంతరావు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.





చెన్నారంలో గోడౌన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి, శంకర్ ఇంట్లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి

ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు ప్రారంభం



నేలకొండపలిలో నిరాహారదీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

నేలకొండపల్లి,మార్చి11(ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ఎటువంటి నియామకాలు చేపట్టకూడదని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. ఈనేపథ్యంలో మంగళవారం నుంచీ రిలేనిరాహార దీక్షలు ప్రారంభించింది. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని మర్చిపోయారన్నారు. నోటిఫికేషన్లను రద్దు చేసే వరకు ఎమ్మార్పీఎస్ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తేళ్ల సురేష్, మాదాసు వెంకన్న, పొట్టపింజర బాలస్వామి, వడ్లమూడి ప్రసాద్, కుక్కల లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగాలు ఇవ్వాలి

ఖమ్మంచర్చికాంపౌండ్:ఎస్సీవర్గీకరణ చేశాకే ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలను విడుదల చేసి ఉద్యోగాలను ఇవ్వాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య మాదిగ, రాష్ట్ర నాయకులు బచ్చలకూర వెంకటేశ్వర్లు మాదిగ కోరారు. మంగళవారం ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూర్యపల్లి నాగేశ్వరరావు, బలంతు యేసు, తగరం వెంకన్న, సూరేపల్లి వెంకటరత్నం, గంట బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సరితా క్లినిక్‌సెంటర్‌లో ఈకార్యక్రమం నిర్వహించారు. నోటిఫికేషన్లను రద్దు చేసేవరకు పోరాటం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పేరం మల్లయ్య, రాష్ట్ర అధికారప్రతినిధి ముదుసుజాకబ్ ప్రతాప్, కొర్లపాటి చిరంజీవి, పల్లి ఉపేందర్, దోతుల వెంకన్న, కాశీమల్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తలసీమియా చిన్నారులకు సదరం సర్టిఫికెట్

- డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): తలసీమియా, సికెల్‌సెల్ చిన్నారులకు త్వరలోనే సదరం సర్టిఫికెట్ జారీ కానుందని ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో బాధిత చిన్నారులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సింగిల్ పేరెంట్‌గా ఉండి చిన్నారులను కాపాడుకుంటున్న మహిళలను ఘనంగా సత్కరించారు. అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్ చిన్నారులకు మందులు పంపిణీ చేశారు. కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ చొరవతో తలసీమియా, సికిల్‌సెల్ జబ్బులకు సదరం సర్టిఫికెట్ జారీ అయేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సర్టిఫికెట్ తో చిన్నారుల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ బాధ్యులు ఈ సర్టిఫికెట్లు కోసం చిన్నారులతో దరఖాస్తులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంకల్ప వ్యవస్థాపకులు ప్రొద్దుటూరి అనిత వైద్యులు, డి.నారాయణ మూర్తి, జాబిశెట్టి రేణుక, లక్ష్మీదీపా, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యాక్షేత్ర స్కూల్ కరస్పాండెంట్ భాగ్య, అనురాధ, సంస్థ బాధ్యులు పాల్గొన్నారు.

చింతగుర్తిలో పశు వైద్యశిబిరం

రఘునాథపాలెం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుర్తి గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని గేదెలు, ఆవులకు మందులు పంపిణీ చేశారు.సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో పశుపోషణపై అవగాహన కల్పించారు. పశుసంపద ఆవశ్యకతపై సత్యసాయి ట్రస్ట్ సభ్యులు సుధాకర్ వివరించారు. గ్రామపెద్దలు కేతినేని సీతారామయ్య, భాస్కర్‌రావు, భూక్య వెంకన్న, జీడిమెట్ల రాముడు, పేరపాక బుచ్చలు తదితరులు పాల్గొన్నారు.

మనీష్‌కు పోతినేని నివాళి

ఖమ్మంరూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బారుగూడెం పంచాయతీ పరిధిలోన శ్రీసిటీలో నివాసం ఉంటున్న పిట్టల సుధాకర్, నిర్మల దంపతుల పెద్ద కుమారుడు పిట్టల మనీష్ కుమార్ మృతిచెందడం బాధాకరమని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు పోతినేన సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మనీష్ మృతదేహన్ని సందర్శించి వారు నివాళులర్పించారు. జిల్లా నాయకులు యర్రా శ్రీకాంత్, కళ్యాణం వెంకటేశ్వర్లు,వై.విక్రమ్, రమేష్, బండారు రమేష్, సుబ్బారావు, విష్ణు, శ్రీనివాస్‌రావు,రాంబాబు,నందిగామ కృష్ణ జక్కంపూడి కృష్ణ నివాళులర్పించారు.

బస్‌షెల్టర్ కూల్చివేత యత్నంపై కేసు నమోదు

ఖమ్మంరూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): బస్సుషెల్టర్ కూల్చడానికి ప్రయతినంచిన వారిపై ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసునమోదైంది. ప్రకారం ఎంవీపాలెం గంగవరపు కొండయ్య, పాసంగుల వెంకయ్య స్మారకార్థం 30ఏళ్ల క్రితం బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టారు. దాన్ని ఈనెల10న ఎంవీపాలేనికి చెందిన కొందరు కూల్చటానికి ప్రయత్నం చేశారు. కూల్చివేతను అడ్డుకోబోయిన సీపీఐశ్రేణులపై దాడికి పాల్పడారు. ఈసంఘటనపై ఎంవీపాలేనికి చెందిన సీపీఐ నాయకుడు పాసంగుల చందరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ఈఘటనకు సీపీఎంకి ఎటువంటి సంబంధం లేదని ఆపార్టీ మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు.

'వికసిత్ భారత్'లో యువత పాత్ర కీలకం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తలపెట్టిన వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమని ఇగ్నో అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ బోళ్ల రాజు అన్నారు. మంగళవారం నగరంలోని కవితా మెమోరియల్ కళాశాలలో ఇగ్నో స్టడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మాస్టర్ డిగ్రీ, పీజీ డిప్లొమా, సర్టిపికెట్ కోర్సులకు ఈనెల 15లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

చెస్‌లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్‌మార్చి11(ఆంధ్రజ్యోతి):ఇటీవల నగరంలో జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించారని పాఠశాల డైరెక్టర్లు రాజావాసిరెడ్డి నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించాలన్నారు.

ఘనంగా కేఎంసీ కమిషనర్ జన్మదినం



ఖమ్మంకార్పొరేషన్,మార్చి11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పాలెపు వెంకటరమణ, కన్నం కృష్ణ ప్రసన్న, కార్పొరేటర్లు రాపర్తి శరత్, కమర్తపు మురళి, కూరాకుల వలరాజు,శుభాకాంక్షలు తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన ఇంజనీరింగ్, మెప్మా, ఉద్యాన, అకౌంట్స్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులు కృష్ణలాల్, సుజాతరాణి, రాధిక, శివలింగం, వసుంధర పుష్పగుచ్చాలు అందించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





పీఆర్టీయూ విజయోత్సవం



విజయోత్సవం జరుపుకుంటున్న పీఆర్టీయూ సభ్యులు

నేలకొండపల్లి,మార్చి11(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పింగలి శ్రీపాల్‌రెడ్డి గెలుపొందటంతో పీఆర్టీయూ నాయకులు మండలంలోని అన్ని పాఠశాలలు తిరుగుతూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మంగళవారం మండల పరిధిలోని దాదాపు అన్నిపాఠశాలల్లో పీఆర్టీయూ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వై.వెంకటేశ్వరు, టి.రత్నకుమార్ తదితరులు ఉపాధ్యాయులను కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డిని గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీపాల్‌రెడ్డి పీఆర్టీయూ అధ్యక్షుడిగా సాధించిన పీఆర్సీ, విరమణ వయస్సును పెంచటం, ప్రమోషన్స్, బదిలీలు తదితర సమస్యలపై చేసిన పోరాటం, కృషి ఫలితమే ఈ గెలపని రత్నకుమార్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, జిల్లా ఉపాధ్యక్షులు రత్నకుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కులవివక్ష కొనసాగుతోంది

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి11(ఆంధ్రజ్యోతి): నేటిఆధునికయుగంలో గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతోందని దీనిని సహించబోమని కేవీపీఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఖమ్మంనగరంలోని మంచికంటి భవన్‌లో జరిగిన కేవీపీఎస్ జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్‌లో జరిగే ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రణయ్ హత్య కేసుపై కోర్టు తీర్పు హర్షణీయమన్నారు. నేటికి గ్రామాలలో దళితుల పట్ల వివక్ష కొనసాగుతుందన్నారు. వీటిని పారద్రోలడానికి ఉన్న చట్టాలు జీవోలు రాజ్యాంగబద్ధ హక్కులను పాలకవర్గాలు అమలు చేయడంలేదన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, మాచర్ల భారతి, బండి రమేష్,బొట్లసాగర్,పాపిట్ల సత్యనారాయణ, ముత్తమాలప్రసాద్, కొమ్ము శ్రీను, నకిరికంటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు



అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం పేదవాడి అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, వైరా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ముదిగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి సామినేని నాగమణి ఇటీవల మృతిచెందగా ఆమె చిత్రపటానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే వెంకటాపురం గ్రామానికి చెందిన కట్ల సురేష్ మాతృమూర్తి కట్ల రంగమ్మ ఇటీవల మృతిచెందిన ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, బేబీ స్వర్ణకుమారి, కోట రాంబాబు, నాగార్జున్‌రెడ్డి, వట్టికూటి సైదులు, వెంకటేశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం



కల్లూరులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

» ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదింటి కల సాకారం కానుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండల పరిధిలోని తూర్పులోకవరం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎల్. రాజేంద్రగౌడ్, సీడీపీవో నిర్మలజ్యోతి, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ సాంబశివుడు, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, సీడీసీ చైర్మన్ కస్తాల నరేంద్ర, కాంగ్రెస్ నాయకులు భూక్యా శివకుమార్‌నాయక్, బాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, యస్‌కె యాకుబ్‌అలీ, శ్రీనువాసరావు, బుర్రి వీరయ్య తదితరులు పాల్గొన్నారు

పెనుబల్లిలో...

పెనుబల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మంగళవారం పెనుబల్లి మండలంలో రూ.595.45కోట్లతో చేపట్టనున్న 124పనులకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని గంగదేవిపాడు, బ్రహ్మళకుంట, లింగగూడెం, పాత అగ్రహారం, సూరయ్యబంజర్ గ్రామాల్లో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టనున్న సైడ్‌డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు అలాగే కేంద్రుపాడులో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సత్తుపల్లి నియోజకవర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో రాజేంద్ర గౌడ్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ సుధీర్, సీడీపీవో నిర్మలాజ్యోతి, ఏఈ రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు పంది వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాచబోయిన కోటేశ్వరరావు, పసుమర్తి విశ్వనాథ్, సోమరాజు సీతరామారావు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కారేపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గంగమ్మతల్లి ఆలయం చుట్టూ ఏర్పాటు చేయనున్న ప్రహరీ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత మండెపుడి వెంకటయ్య మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.50వేలను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను దాతను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇమ్మడి తిరుపతిరావు, మేకల మల్లయ్య, ముత్తయ్య, కోటయ్య, సీతారాములు, లక్ష్మీనారాయణ, తోగర శ్రీను, రామారావు, ఉపేందర్, మధు, కుమార్ పాల్గొన్నారు.

బ్యాగ్ అప్పగింత

మధిరటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పోగొట్టుకున్న బ్యాగ్ తిరిగి సంబంధిత వ్యక్తికి మధిరటౌన్ పోలీసులు మంగళవారం అప్పగించారు. ఖమ్మానికి చెందిన చింతలపాటి పార్థసారథి అనే వ్యక్తి విజయవాడ నుంచి ఖమ్మం వెళ్తూ మార్గమధ్యలో చింతకాని మండలం నాగులవంచ గ్రామం వద్ద బ్యాగ్ పోగొట్టుకున్నాడు. ఆ బ్యాగు మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన కనకపూడి గోపాల్‌కు సోమవారం దొరికింది. గోపాల్ ఆ బ్యాగును మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ఆ బ్యాగులో విలువైన ల్యాండ్ డాక్యుమెంట్లతో పాటు ఐఫోన్ ఉండటంతో అందులో లభించిన వివరాల ప్రకారం టౌన్ ఎస్‌ఐ రుత్విక్ సాయి బాధితుడికి సమాచారం ఇచ్చి బ్యాగ్‌ను తిరిగి అతడికి అప్పగించారు.

గుండెపోటుతో గీత కార్మికుడి మృతి



గాలి కృష్ణ(ఫైల్)

మధిర రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామంలో జరిగింది. గీత కార్మిక సొసైటీలో సభ్యుడైన గాలి కృష్ణ(45) తన ఇంటి వద్ద అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. గీత కార్మికసంఘంలో సభ్యుడైన కృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం వచ్చేలా కృషి చేయాలని కోరారు.

మట్టి టిప్పర్ల అడ్డగింత



ఎండపల్లి గుట్ట వద్ద మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

మధిర రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఎండపల్లి గుట్ట నుంచి భారీ వాహనాల్లో మట్టి తరలిస్తున్నారని దీంతో రోడ్లు దెబ్బతినడంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రొంపిమళ్ల, మల్లారం గ్రామస్థులు మంగళవారం రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనాలు పెట్టి మట్టి టిప్పర్లను నిలిపివేశారు. మల్లారానికి చెందిన కొంగర రంగయ్య, చావా నరేష్‌ల ఆధ్వర్యంలో రెండు గ్రామాలకు చెందిన పలువురు టిప్పర్లను నిలిపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీగా ఓవర్‌లోడ్‌తో మట్టిని తరలించడం వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, వీటి ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్రవాహనదారులకు కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పైఅధికారులు స్పందించి ఓవర్‌లోడ్ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట వేయాలని లేని పక్షంలో మట్టి తోలకాలను పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించారు.

యువకుడిపై కేసు నమోదు

చింతకాని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై అదే గ్రామానికి వివాహితుడైన ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఈనెల ఏడోతేదీన చోటుచేసుకుంది. ఈనెల ఏడోతేదీన తనను బలవంతంగా బయటకు తీసుకువెళ్లి అత్యాచారం చేశాడని బాధితురాలు మంగళవారం చింతకాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బోనకల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన చట్టు సత్యం క్రాస్‌రోడ్డు వద్ద గల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కొబ్బరికాయల వ్యాపారం చేస్తుంటాడు. ద్వి చక్ర వాహనంపై వస్తుండగా జారి పడటంతో గాయాలయ్యాయి. 108 సిబ్బంది కోట బాను సహాన్, గోపాలకృష్ణలు ప్రథమ చికిత్స చేసి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

మధిర రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో మోడల్ గ్రామంగా ఎంపికైన చిలుకూరు గ్రామానికి చెందిన 37ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయి. ఈ గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో పాఠశాల భవనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కొండల్‌రావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంబన సాధించాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

వైరా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో మహిళలు మరింతగా ఆర్థిక, సామాజిక స్వావలంబన కలిగి ఉంటే సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని అందుకోసం అందరూ పనిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మహిళా సమాఖ్య సభ్యులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వైరా మండల పర్యటనలో ఉండగా కేజీ సిరిపురంలో గ్రామ మహిళా సమాఖ్య సాధారణ సమావేశం జరుపుతున్న సమాచారం తెలుసుకొని అనుకోని అతిథిగా ఆయన హాజరయ్యారు. 23మంది సంఘ సభ్యులున్న కొద్దిపాటి సమావేశానికి కలెక్టర్ రావడంతో సమాఖ్య సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పరిస్థితి, అందుతున్న సేవలు ఇతర సమస్యలు, పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉపాధ్యాయులు, డాక్టర్ల పనితీరు, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, గ్రామ కార్యదర్శి, అధికారుల పనితీరు, పర్యవేక్షణ, అంగన్‌వాడీ కేంద్రం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మహిళలతో వారి మధ్య కూర్చొని కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో నూర్‌ద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా పనులు: ఎస్‌ఈ



సత్తుపల్లిలో సబ్‌స్టేషన్ వద్ద సూచనలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసాచారి

కల్లూరు, మార్చి11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలను అధిగమించేలా తమ శాఖ తరుపున ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసాచారి అన్నారు. మంగళవారం కల్లూరులోని విద్యుత్ ఉపకేంద్రంతో పాటుగా లోకవరంలోని మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ సబ్‌స్టేషన్‌ను, ప్లాంట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఆపరేషన్ డివిజన్ డీఈ ఎల్. రాములు, కల్లూరు విద్యుత్ శాఖ ఏఈ వెంకట్ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను తప్పనిసరిగా అమర్చుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఈ.శ్రీనివాసాచారి సూచించారు. మంగళవారం ఆయన సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి డీఈఈ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. మండలంలోని గంగారం సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఓవర్ లోడ్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో డీఈఈ ఎల్.రాములు, ఏడీఈ ప్రసాద్, ఏఈలు శరత్‌బాబు, కావ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టం అమల్లోకి వచ్చాకే ఉద్యోగాలు ఇవ్వాలి

» ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



బోనకల్‌లో దీక్ష చేస్తున్న నాయకులు

బోనకల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టం అమల్లోకి వచ్చాకే ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలను విడుదల చేసి ఉద్యోగాలను ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కా ర్యదర్శి చిలక నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలవంతపు నరసింహరావు, తాటికొండ వెంకటరత్నం, తోటపల్లి సాల్మన్, తోటపల్లి చిన సైదులు, కోట హన్మంతరావు, మాగి ముఖేష్, మర్రికంటి గంగాధర్, ప్రభాకర్‌రావు, బలుగూరి వెంకటేశ్వర్లు, మందా ఏసు, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో....

కారేపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు అన్ని రకాల ఉద్యోగ ఫలితాలను నిలుపుదల చేయాలనే డిమాండ్‌తో మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అదేర్ల రామారావు, అదేర్ల రాములు, కేశగాని బాలకృష్ణలు దీక్షలు ప్రారంభించారు. ఈసందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తై చట్టం అమల్లోకి వచ్చే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునిల్ డిమాండ్ చేశారు. మంగళవారం మధిర తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకపూడి శ్రీను, రాజ, అక్కులు పాల్గొన్నారు.

ముదిగొండలో...



ముదిగొండలో....

ముదిగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణను వర్తింపజేయాలని ఎంఆర్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షను చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు నూకల నాగేశ్వరరావు, ఎం.భద్రం, యండ్రాతి నాగరాజు, నాగేశ్వరరావు, అనిల్, రాంబాబు, జానీ, కిరణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పన్నులు తగ్గించాలి

● సీపీఎం డివిజన్ కార్యదర్శి వీరభద్రం

వైరా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో పెంచిన ఇళ్లపన్నుల భారాన్ని తగ్గించాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మునిసిపల్ కార్యాలయం ముందు నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం డివిజన్, పట్టణ కార్యదర్శులు భూక్యా వీరభద్రం, చింతనిప్పు చలపతిరావు కోరారు. సమస్యలతో కూడిన కరపత్రాలను పంచుతూ మంగళవారం వైరాలో ప్రచారం చేశారు. మహాధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, షేక్.నాగూల్‌పాషా, కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, యనమద్ది రామకృష్ణ, పాసంగులపాటి చలపతిరావు, హరి వెంకటేశ్వరరావు, మాడపాటి మల్లికార్జున్, రేగళ్ల మల్లయ్య, మాజీ ఎంపీపీ బొంతు సమత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఏన్కూరు, మార్చి11(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి కుటుంబానికి రూ.30వేలు ఆర్థికసాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని టీఎల్ పేట గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీనివాస్ కుమార్తె మణితేజ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా కష్టాలలో ఉన్న స్నేహితుడిని ఆదుకునేందుకు 1991-92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు కలిసి రూ.30వేల నగదు, బియ్యాన్ని మంళవారం అందించారు. ఈకార్యక్రమంలో గుండా బాబు, కొంగర చంద్రయ్య, వరదబోయిన బాబు, శ్రీను పాల్గొన్నారు.

'ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై చర్యలు'

మధిరటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): మధిర టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే వారిపై చట్టపరంగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మధిర టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ కొట్టె రుత్విక్ సాయి అన్నారు. మంగళవారం మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక కావాలసిన వారు ప్రభుత్వం ఎంపిక చేసిన రీచ్‌ల నుంచి తగు కూపన్‌లు తీసుకుని రవాణా చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సాగు నీరందించడంలో ప్రభుత్వాలు విఫలం

» రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్

కొణిజర్ల, మార్చి11(ఆంధ్రజ్యోతి): వారబందీ లేకుండా సాగర్‌జలాలను ఏప్రిల్ చివరి వరకు ఇచ్చి పంటలు కాపాడాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని పెద్దమునగాల, పెద్దగోపతి గ్రామాలలో ఎండుతున్న వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వలన పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. అధికారుల సమన్వయం లోపించి సాగునీరు ప్రణాళికలను సమగ్రంగా ఏర్పాటు చేసుకోవడంలో విఫలం అయ్యారని ఆరోపించారు. మేజర్‌కాల్వల తూములను నిలిపివేయడం అధికారులకు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తమ్మిశెట్టి వెం కటేశ్వర్లు, శ్రీనివాసరావు, మండల రైతు సంఘం అధ్యక్షులు డేరంగుల లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో యువత పాత్ర కీలకం

» ఇగ్నో అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బోళ్ల రాజు

సత్తుపల్లి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అత్యున్నత శక్తిగా మన దేశం ఎదుగుతుందని, వికసిత్ భారత్ 2047లక్ష్యసాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని హైదరాబాద్‌కు చెందిన ఇగ్నో అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బోళ్ల రాజు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలో ఇగ్నో-వికసిత్ భారత్‌లో భాగంగా మాట్లాడుతూ జనవరి-25 సెషన్‌కు సంబంధించిన వివిధ మాస్టర్, డిగ్రీ, పీజీ, డిప్లమో, ఎంబీఏహెచ్‌ఎం, ఎంబీఏహెచ్‌సీహెచ్‌ఎం, పీజీసీపీపీ సర్టిఫికేట్ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తులు ఈనెల 15వరకు ఉంటుందన్నారు. ఇగ్నోలోని పలు ప్రోగ్రామ్‌లలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉండగా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చల్లా శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్‌రాజా జయవరపు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

వైరా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేసి, క్వింటా ఒక్కింటికి రూ.25వేలు చెల్లించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. వైరా మండలంలోని పుణ్యపురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి పొంగులేటికి తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆధ్వర్యంలో ఒక వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, కట్టా దర్గయ్య, చలపతిరెడ్డి, అయిలూరి శేషిరెడ్డి, వడ్లమూడి మధు, అమరనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేంసూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు వేంకటేశ్వరస్వామివారి కల్యాణాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు, రాత్రి స్వామివారి ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. స్వామివారిని కందుకూరులో పెరుమాళ్ల స్తంభం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లి ఈ ఉత్సవం నిర్వహించారు. స్వామివారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలకరించారు. ఆలయ ఈవో వీఎల్‌వీ.వెంకట్రావ్ ఏర్పాట్లు పూర్తిచేశారు.

కారేపల్లిలో 13న ..

కారేపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సంతప్రాంగణంలో గల వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవానికి అధికారులు సిద్ధం చేశారు. ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి నల్లమోతుల శేషయ్య మంగళవారం మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నాం శ్రీలక్ష్మీపద్మావతి సహిత వేంకటేశ్వరస్వామివార్ల కల్యాణం వైభవంగా జరుగుతుందన్నారు. మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రజా ప్రభుత్వం కాదు..ఇది దగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజ్

» జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం, మార్చి11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను మభ్యపెట్టి అమలుగాని హామీలు ఇచ్చి ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజాప్రభుత్వం పేరుతో దగా మాటలు చెబుతుందని బీఆర్ఎస్ నేత మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇనగాలి గ్రా మంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరుల సమవేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నడపలేక కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. 20శాతం కమీషన్లకోసం కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రజల్లో కేసీఆర్‌పై సానుభూతి పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, యన్నం శ్రీనివాసరెడ్డి, బాలరాఘవరెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, ఖన్నాం, బొర్రా నరసింహారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

» నాయీ బ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న

మధిరటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న కోరారు. మంగళవారం మధిరలోని సంఘ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి తమ సమస్యల సాధన కోసం కలిసి పని చేయాలని కోరారు. నాయి బ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, దానికి రూ.వంద కోట్లు కేటాయించాలని, వడ్డీ లేకుండా రుణాలు అందించాలని, ప్రతి పేద నాయీ బ్రాహ్మణుడికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తూముల నాగబూషణం, మునుగోటి వెంకటేశ్వర్లు, గుండెమెడ బాలాజీ, లింగంపల్లి అప్పారావు, నాగులవంచ రామారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో కిష్టారం సమస్యపై ప్రస్తావిస్తాం

» బీజేపీ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సత్తుపల్లి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కిష్టారం సమస్యలపై బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించనున్నట్లు బీజేపీ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్యపై స్పందించి గ్రామానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సైలోబంకర్ కారణంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామస్థులపై కనికరం లేని సింగరేణి సంస్థపై చర్యలు తీసుకోవడంతో పాటు అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇదివరకే కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. బాధితుల సమస్య పరిష్కారమయ్యే వరకు బీజేపీ వారివెంటే ఉంటుందని, త్వరలోనే గ్రీన్ ట్రిబ్యూనల్‌ను సైతం ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం స్పందించకపోతే బాధితుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారికి తక్షణమే యుద్ధప్రాతిపదికన పునరావాసం కల్పించి ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు.

'డిజిటల్ సేవలను వినియోగించుకోవాలి'

ఏన్కూరు, మార్చి11(ఆంధ్రజ్యోతి): డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరు విరివిగా వినియోగించుకోవాలని రిజర్వుబ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాధిక భరత్ కోరారు మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళ సంఘ సభ్యులకు డిజిటల్ పేమెంట్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయేది డిజిటల్ యుగమని కాలానుగుణంగా మహిళలు మార్పుచెందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో రీజనల్ బ్యాంకు ఎఫ్ఐసీ నోడల్ అధికారి సునిల్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు బీఎం శోభన్‌బాబు, ఏపీవో వెంకటరామారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు సుమంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌బీఐ ఏజీఎం రాదిక భరత్